LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM Visit Internet Edition @ www.zaminryot.com "e-mail : editor@zaminryot.com"

జమీన్‌రైతు

D.R. UTTHAMA ★★★ HOTEL

డి.ఆర్. ఉత్తమలో వింటర్ ఆఫర్

- వెజిటేరియన్ మీల్స్ (మధ్యాహ్నం మాత్రమే) Rs. 45/-
- అందరికీ అందుబాటులో ఎన్నో రకాల నాన్‌వెజ్ ఐటమ్స్ కలవు.
- ప్రతి ఆదివారం నెల్లూరు స్పెషల్ వుడ్‌తో బఫే లంచ్ రూ. 160/- లకే (అన్ని టార్క్స్‌లతో కలిపి).

Phones : 317777 -10 Lines

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు సంపుటి : 73 సంచిక : 38 20.9.2002 శుక్రవారం 12 పేజీలు వెలిపత్రి : రూ.3.00లు జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

వైఎస్ వెటకారానికి విలవిల!

చంద్రబాబు వాగ్దాన భంగాలపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం మొదలయ్యింది. ఉద్యమం అంటే ధర్నాలు, బంద్‌లు కాదు; ఊరేగింపులు, ప్రదర్శనలు లేవు; పోలీసులు, అరెస్ట్‌ల ప్రసక్తే ఉదయించడం లేదు; ఊరూరికి వెళ్లడం, ముఖ్యమంత్రి వేసిన శంఖుస్థాపన రాళ్ల చుట్టూ మొక్కలు నాటి రావడం - ఇంతే ఈ ఉద్యమం. ఇందులో ఎవరూ అభ్యంతరపెట్టడానికి ఏదీ లేదు; రాజకీయం అని విమర్శించడానికి అసలే అవకాశం లేదు. రాజకీయాలలో కీలెరిగి వాతపెట్టడం అంటే ఎట్లా వుంటుందో చేసి చూపిస్తున్నాడు సిఎల్పీ నాయకుడు డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి.

చూడడానికి ఎంతో సరళంగా, సౌమ్యంగా, సమస్కారయుతంగా కనిపిస్తున్నది ఈ ఉద్యమం. కానీ తెలుగుదేశం ప్రభుత్వానికి మాత్రం గొంతులో పచ్చి వెలక్కాయ వలె అడ్డం పడుతున్నది. తలెత్తుకోలేని అవమానకర దుస్థితిని, సమాధానం చెప్పుకోలేని ఇబ్బందికర పరిస్థితిని కల్పిస్తున్నది. చంద్రబాబు అసంఖ్యాకంగా వాగ్దానాలు చేసింది నిజం; చేసిన వాటిలో ముప్పాతిక భాగం మర్చిపోయింది కూడా నిజమే. తన స్వహస్తాలతో కొన్ని వేల పథకాలు, శంఖుస్థాపన రాళ్లు వేసింది నిజం; ఆ తర్వాత వాటిని విస్మరించింది కూడా నిజం. ఇప్పుడు రాజశేఖరరెడ్డి ప్రస్తావిస్తున్నది, ఎత్తి చూపుతున్నది, వెటకారం చేస్తున్నది ఈ వాగ్దానాల గురించి మాత్రమే.

శంఖుస్థాపన రాళ్ల చుట్టూ మొక్కలు నాటే వుద్యమం తెలుగుదేశం ఆయువు పట్టు మీద దెబ్బతీస్తున్నది

శంఖుస్థాపన రాళ్లు కళ్ల ముందు కనిపించేవి. వాటి మీద వివరంగా వేసిన వారి పేర్లు, ఊళ్లూ వుంటాయి. వాటితో తమకు సంబంధంలేదని చెప్పలేరు. వాగ్దానాలకు కూడా స్పష్టమైన ఆధారాలు వున్నాయి. ముఖ్యమంత్రి హోదాలో ఇచ్చిన హామీలు కాబట్టి, ప్రతి మాట పత్రికలలో వార్తగా రావడం సహజం. పాత పత్రికలు తిప్పి చూస్తే చాలు - ఇట్టే దొరికిపోతాయి అవి.


వాగ్దాన భంగం - రాజకీయవాదుల జన్మహక్కు; శంఖుస్థాపన రాళ్లను సమాధి రాళ్లుగా మార్చడం - కూడా ప్రభుత్వ నేతలు ప్రాథమిక హక్కుగా భావిస్తుంటారు. గాలిలో కలిసిపోయిన హామీల మాటలను ఎవరు గుర్తించుకోగలరన్న భరోసాతో కాలం గడిపేస్తున్నారు నేతలు. కానీ రాజశేఖరరెడ్డి ఇప్పుడా గోతులను తవ్వి అస్థిపంజరాలను వెలికి తీస్తుండడంతో ముఖ్యమంత్రికి ఊపిరాడడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరంగా కాని, వ్యక్తిగా రాజశేఖరరెడ్డి పరంగా కానీ తనపై ఎప్పుడూ ఏ విమర్శ వచ్చినా - మీ చరిత్ర నాకు తెలుసులే అని ఎదురు దబాయింపుకు దిగడం చంద్రబాబుకు అలవాటు. ఇన్నేళ్లుగా ఇదే తీరులో కాంగ్రెస్ ఉద్యమాలను చీపురు పుల్లల క్రింద తీసి పారేస్తున్నాడాయన. కరెంట్ ఛార్జీల ఆందోళన కాని, అసెంబ్లీలో పలుమార్లు తనపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో కాని ఇదే తీరులో వ్యవహరించడం ఆయనకు అలవాటు. అయితే ఇప్పుడా అవకాశం లేదు. రాజశేఖరరెడ్డి రాజకీయ విమర్శలు చేయడం లేదు, అవినీతి ఆరోపణల బురద చల్లడం లేదు; అభాండాలు వేయడం లేదు; వీధి పోరాటానికి దిగడం

తొలవ 7వ పేజీలో

చిరంజీవి బుర్రలో రాజకీయ పురుగు

సినీ నటుడు చిరంజీవిని రాజకీయాలలోకి తీసుకరావడానికి మరొకసారి తీవ్ర ప్రయత్నం ప్రారంభమయ్యింది. గత శాసనసభ ఎన్నికల సమయంలోనే కొందరు కాంగ్రెస్ పెద్దలు ఈ ప్రయత్నం చేశారు - కాని అది ఫలించలేదు. అప్పటిలో చిరంజీవి మనసు మార్చడానికి చంద్రబాబు ఎన్ని ఎత్తులు పన్నాడో లెక్కలేదు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ సంస్థకు జూబ్లీ హిల్స్‌లో పది కోట్ల విలువ చేసే స్థలం ఉచితంగా ఇచ్చి మచ్చిక చేసుకున్నాడు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య సత్సంబంధాలు ఏర్పడ్డాయి.

అయితే పరిటాల రవి కారణంగా ఇప్పుడు ఈ సంబంధాలకు విఘాతం కల్గి వుంది. చిరంజీవికి ఫిలిం నగర్‌లో గల ఒక స్థలాన్ని పరిటాల రవి ఆక్రమించాడు. తనకు ప్రాణ ప్రమాదం వున్న దృష్ట్యా తన ఇంటి ప్రక్కన వున్న ఈ స్థలాన్ని తనకు అమ్మి వేయమని రవి అడిగితే చిరంజీవి ఒప్పుకోలేదు. దానితో రవి ఆ స్థలంలో తన అనుచరులు, తన సెక్యూరిటీ సిబ్బంది వుండడానికి గుడారాలు వేయించాడు. వాటిని ఖాళీ చేయమని అడగడానికి వెళ్లిన చిరంజీవి తమ్ముడు పవన్ కళ్యాణ్‌కు పరిటాల రవి ఇంటిలో శృంగభంగం జరిగింది. ఆ దౌర్జన్యంపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తే ఎట్నో పర్తుక పొమ్మని తమకే నచ్చచెప్పాడు తప్ప, పరిటాల రవిని మందలించడం కాని, తమ స్థలం తమకు స్వాధీనం చేయడం కాని చేయలేదు. విధిలేని పరిస్థితులలో కోటి రూపాయలకుపైగా విలువ చేసే ఆ స్థలాన్ని



40లక్షలకు పరిటాల రవికి అప్పచెప్పి వెను తిరిగి రావాల్సి వచ్చింది. ఈ అవమాన భారం చిరంజీవిని చాలా కాలం నుంచి బాధిస్తున్నది. దీనికి ప్రతీకారం తీర్చుకోవాలన్న కోరిక కూడా ఆయనలో వుంది. అందుకు తగిన సమయం సందర్భం కోసం ఎదురు చూస్తున్నాడు.

తొలవ 7వ పేజీలో

వాటాలు కుదరకే కృష్ణాపట్నం వాగ్దాన భంగాలు!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లాలో చేసిన వాగ్దానాలు, వేసిన పునాదిరాళ్లపై ప్రజలను చైతన్య వంతులను చేయడానికి సిఎల్పీ నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి నెల్లూరు రాబోతున్నారు. జిల్లా వ్యాప్తంగా పర్యటించబోతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయన పర్యటన కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లాలో జరిపిన వాగ్దాన భంగాలపై జమిన్‌రైతు విలేఖర్లు సేకరించిన సమాచారం క్రోడీకరించి ఇస్తున్నాం. ముఖ్యమంత్రి గత ఏడేళ్లలో 40 పర్యాయాలకుపైగా నెల్లూరు జిల్లాలో పర్యటించారు. వాటిలో అధిక భాగం జన్మభూమి గ్రామసభల సందర్శనలు, ఎన్నికల ప్రచార సభలు. జన్మభూమి కార్యక్రమాలలో పెద్దగా వాగ్దానాలు చేయడం అలవాటు లేదు చంద్రబాబుకు. ఆయన హామీలన్నీ ఎన్నికల సభలలోనే జరిగిపోయాయి. ఆ హామీల జాబితా కొండవీటి చాంతాడంత వుంది. రూపాయి మొదలుకొని ఉదయగిరి వరకు ఆయన చేసిన వాగ్దానాలు ఇన్ని అన్ని కావు. వాటన్నిటిని ఏకరువు పెట్టాలంటే స్థలం చాలేటట్లు లేదు. అందువల్ల ముఖ్యమైన వాటిని మాత్రం ప్రస్తావిస్తున్నాం.

నెల్లూరు జిల్లాలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల జాబితా కొండవీటి చాంతాడంత వుంది; అందులో ఆచరణకు నోచుకున్నవి మాత్రం వేళ్లమీద లెక్కించవచ్చు!

జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన ముఖ్యమైన వాగ్దానాలలో ఒక్కటి కూడా ఆచరణకు నోచుకోక పోవడం దురదృష్టకరం. అన్నిటి కంటే ముఖ్యమైనది కృష్ణాపట్నం ఓడ రేవు. ఆరేళ్ల క్రితం 1996లో ఎంతో ఆర్భాటంగా శంఖుస్థాపన చేశారాయన. ప్రైవేటు రంగంలో 1500కోట్ల రూపాయలతో రేవు నిర్మాణం జరిగిపోతుందని జనాన్ని నమ్మించారు. దీని నిర్మాణం చేపట్టింది - చంద్రబాబు సన్నిహిత మిత్రులు, బంధువులు. శంఖుస్థాపన సమయంలో జిల్లా అధికారులపై వారు చూపిన జులుం అంతా ఇంతా కాదు. అప్పటి కలెక్టర్ సాంబశివరావుకు వారిని ప్రత్యేక అతిథులుగా చూడమని ముఖ్యమంత్రి నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే శంఖుస్థాపన తర్వాత వారు అదృశ్యం అయిపోయారు. ఈ రేవు నిర్మాణాలలో తనకు ఇస్తామన్న వాటాపై చంద్రబాబు పీచీ పెట్టడం వల్లనే వారు వెనక్కి వెళ్లిపోయారన్న వదంతి ఒకటి వుంది. ఈ శంఖుస్థాపన సమయంలోనే కృష్ణాపట్నం థర్మల్ స్టేషన్ మంజూరై పోతుందని నమ్మకంగా చెప్పాడు ముఖ్యమంత్రి. జివికె సంస్థ అందుకోసం అన్నీ ఏర్పాట్లు చేసింది; భూసేకరణ కూడా పూర్తి అయ్యింది. కానీ ఆ తర్వాత వాటాలలో పేచీల వల్లనే కాబోలు ఆ కర్మాగారానికి అనుమతి నిరాకరించింది రాష్ట్ర ప్రభుత్వం. అందుకు వారు చూపిన కారణం - రాష్ట్రంలో ఇప్పటికే మిగులు కరెంటు వుంది కాబట్టి కొత్త ప్రాజెక్ట్‌ల నిర్మాణం అనవసరం అని. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఎంత అధికంగా వుండేది - నిత్యం మనం అనుభవించే కరెంట్ కోతలే చెప్తున్నాయి.

ఈ రెండు వాగ్దానాలు జిల్లా జన జీవితాన్ని, ఈ ప్రాంత ఆర్థిక స్థోమతను ఇతోధికంగా మెరుగుపరచేవి. కాని ఆ రెండింటినీ నిర్దాక్షిణ్యంగా విస్మరించాడు చంద్రబాబు. కృష్ణాపట్నం ఓడ రేవులో చంద్రబాబు వేసిన శంఖుస్థాపన ఫలకం కాకుల రెట్టలతో దీనంగా కనిపిస్తున్నది. దానిని తుడిచేవారు కూడా లేరు.

ఇంతే ప్రాధాన్యత కల్గిన మరొక వాగ్దానం - తెలుగుగంగ బ్రాంచ్ కాలువల నిర్మాణం. 1999 ఆగస్టు 29తేది వెంకటగిరిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో బ్రాంచి కాలువల నిర్మాణాలకు నిధుల మంజూరు జరిగిపోతుందని; ఆరు నెలల లోపల లక్ష ఎకరాలకు నీటి సరఫరా మొదలవుతుందని ప్రకటించాడు ముఖ్యమంత్రి. కాని ఈనాటికీ ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం కాల్వల త్రవ్వకం జరపలేదు. ఇదే సభలో వెంకటగిరిని మరొక కుప్పం వలె అభివృద్ధి చేస్తానని కూడా ప్రకటించాడు ముఖ్యమంత్రి. వెంకటగిరి టౌన్‌లో చెత్త కుప్పల దుర్గంధం తప్ప కుప్పం తరహా అభివృద్ధి ఆనవాలే లేవు.

మరొక కీలకమైన వాగ్దానం - సంగం దగ్గర బ్యారేజి నిర్మాణం. ఈ బ్యారేజి ద్వారా లక్ష ఎకరాలకు అదనపు నీటిపారుదల సౌకర్యం కల్పిస్తామని మాట ఇచ్చారాయన. కాని కూలిపోతున్న పాత ఆనకట్టను ఇనుక బస్తాలతో కప్పి పెట్టడం తప్ప మరేమీ జరగలేదు. కనీసం ఆ ప్రయత్నం కూడా జరగలేదు.

తొలవ 12వ పేజీలో

మంత్రి తిట్టాడని ఆత్మహత్యాయత్నం!

కాలం కల్సి రానప్పుడు కర్రే పామై కరుస్తుందంటారు. మంత్రి చంద్ర మోహన్‌రెడ్డి అటువంటి చిక్కులలోని పడిపోయాడిప్పుడు. ఎద్దల రాము అనే కీలకమైన తెలుగుదేశం కార్యకర్త ఆత్మ హత్యా ప్రయత్నంచేసి, అందుకు కార కుడు మంత్రి చంద్రమోహన్‌రెడ్డి అని వాంగ్మూలం ఇచ్చాడు మొన్న 18తేది.

ఎద్దల రాము తెలుగుదేశం పార్టీ పెట్టినప్పటినుంచి అందులోనే వున్న ఎన్‌టిఆర్ వీరాభిమాని. మొదట మొదట అతడికి పార్టీలో మంచి గుర్తింపే వుండేది. టౌన్ తెలుగుయువత అధ్యక్షుడిగా, తెలుగువిద్యార్థి నిర్వాహకుడిగా కూడా పని చేశాడు కొంతకాలం. అయితే రాజకీయాలలో బ్రతకడం చేతకానివాడు కాబోలు, మెల్లమెల్లగా తెరమరుగై పోయాడు. అయితే పనుపుపిచ్చి వదలక ఎక్కడ ఎవరు తెలుగుదేశం సభలు పెట్టినా ఎవరి పిలుపు అవసరం లేకుండా అక్కడకు వెళ్లి, జెండాలు

చంద్రమోహన్‌రెడ్డికి కర్రేపామై కరిచే కాలం నడుస్తోంది

బ్యానర్లు కడుతూ రాజకీయం గుల తీర్చుకొనే వాడట. బ్రతుకు తెరువుకోసం చిన్న టిఫిన్ సెంటర్ నడుపుకొనే వాడట. వున్న కొద్దిపాటి అస్తిపాస్తులు రాజకీయాలలో కరిగిపోవడంతో, ఏదైనా దారి చూపిస్తాడేమోనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశాడట. అయన అంతావిని, మంత్రి చంద్ర మోహన్‌రెడ్డి దగ్గరకు వెళ్లు, హోటల్ నడుపుకోవడానికి బ్యాంకు అప్పు ఏర్పాటు చేస్తాడు అని చెప్పాడట.

ఆ ఆశతో రాము, మంత్రి చంద్ర మోహన్‌రెడ్డిని కలుసుకొన్నాడు. అయితే మంత్రి ఏ చీరాకుతో వున్నాడో కాని, రామును దులపరించి పారేశాడట. ఎద్దు లాగా వున్నావు, ఏదైనా పని చేసుకొని బ్రతకవచ్చుకదా, సహాయం అని నా ప్రాణం తీస్తావెందుకు అని కసిరి కొట్టాడట. ఆ సమయంలో రాము భార్య కూడా పక్కనే వుండింది. తన భార్య ఎదుట తనకు అంత అవమానం జరగడం సహించలేక రాము ఇంటికి వెళ్లి, 100నిద్ర మాత్రలు మింగి ఆత్మ హత్యకు ప్రయత్నించాడు. అయితే సకాలంలో అతడి భార్య ప్రమాదం కని పెట్టి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణం దక్కింది.ఆస్పత్రిలో వాంగ్మూలం ఇస్తూ రాము ఈ కథంతా వినిపించి, మంత్రి చేసిన అవమానం వల్లే తాను ఆత్మ హత్యకు పాల్పడ్డానని చెప్పాడు.

రాము మంత్రి దగ్గరకు వెళ్లింది బ్యాంకు అప్పు ఇప్పించమని అడగడా నికి; కాని ఆ కోరిక విన్పించడంలో తడబాటుపడి, తనకేదైనా సహాయం చేయమని దీనంగా కోరడంతో, విషయం అర్థం కాక, డబ్బుకోసం పీడించే వాడిగా భావించి కసురుకొన్నాడట మంత్రి. దానితో ఇంత పెద్ద పాపం నెత్తిమీద పడింది.

రామువంటి కార్యకర్తలకు ఏ రాజకీయ పార్టీలోనైనా ఇదే దుస్థితి తప్పడంలేదు. రాజకీయాలను అడ్డం పెట్టుకొని బ్రతకడం చేతకాని వారు రాజకీయాలలోకి రావడమే అనర్థంగా పరిణమిస్తున్న రోజులివి. వారిపట్ల సానుభూతి చూపడం తప్ప ఎవరు చేయగలిగింది ఏమి వుంది చెప్పండి?

జమీన్‌రైతు
వెంకటరమణ విలాస్ మిద్దెపై,
పాగతోట, నెల్లూరు. ఫోన్: 327354
చందా
సంవత్సరానికి రూ.150లు
విదేశాలకు రూ. 800లు
చెక్కు ద్వారా చందా చెల్లించు వారు అదనంగా బ్యాంక్ కమీషన్ రూ.40లు కలిపి పంపండి.

స్నేహా సర్జికల్ క్లినిక్
డా॥ టి.శ్యామ్ సుందర్, M.S., ATLS, ALS (UK)
లాప్రోస్కోపిక్ సర్జన్ (EX. రెసిడెంట్ సర్జికల్ గాస్ట్రో ఎంటరాలజీ, స్విమ్స్)
మా ప్రత్యేక
- పెద్ద ఆపరేషన్ లేకుండా లాప్రోస్కోపిక్ పద్ధతిలో గాల్‌బ్లాడర్ (పిత్తాశయం), అపెండిక్స్, వ్యారికోసిల్ మరియు ఓవరికీ సంబంధించిన సర్జరీలు.
- కడుపు మరియు పేగుకు సంబంధించిన సమస్యలకు క్రమపద్ధతిలో పరిమితిని తెలుసుకొని ఆపరేషన్ చేయబడును.
- కామెర్లు మరియు HEPATOBILIARY (లివరు, పిత్తాశయం) సమస్యలకు ప్రత్యేక చికిత్స

FOR EMERGENCY, CALL 318270 CELL 98492 91604
మానసా ప్లాజా, వెంకటరమణ హోటల్ ప్రక్కవీధి, (రైల్వేలైన్ సైపు), పాగతోట, నెల్లూరు. ఫోన్: 301346



నెల్లూరు నరన్నతినగరలో వీధుల వివరాలు తెలిపే బోర్డులు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ అనురాధ. ప్రక్కన రమేష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీధరకృష్ణారెడ్డి, నేతాజి పైలట్ స్కూల్ యం.వి.సుబ్బారెడ్డి, బోర్డుల దాత మాడరన్ స్కూలు అధినేత విజయకుమార్‌రెడ్డి వున్నారు.

ఎమ్మెల్యేలకు అసెంబ్లీ చాలలేదేమో జి.ప.ను కూడా చాకిరేవు చేశారు!

అసెంబ్లీలో అరుచుకోవడం, కరుచుకోవడం అలవాటైపోయిన మన ఎమ్మెల్యేలకు ఎక్కడ ఏ సమావేశం జరిగినా అదే ఆనవాయితీ అయిపోతున్నది. /శ్రీశ్రీ ఎప్పుడో చెప్పాడు కదా-

చాకిరేవు
శాసనసభ
ఏదైతేనేమి
ఏచ్చటనైతేనేమి
పోటీపడి కాటులాడ అని.

17తేది జరిగిన జడ్పీ సమావేశంలో నెల్లూరు ఎమ్మెల్యేల వీరావేశం చూసి తరించాలే కాని, వర్ణించతరం కాదు. కోట జిప కోఆప్షన్ సభ్యుడు బాషా చేసిన ఒక చిన్న వ్యాఖ్య సమావేశంలో వేడి పుట్టించింది. లోక్‌సత్తా నిర్వాహకుడు జయప్రకాష్ నారాయణ్ తేజ టీవికి ఇంటర్వ్యూ ఇస్తూ పనికి ఆహార పథకంలో ప్రతి తెలుగు దేశం ఎమ్మెల్యే సరాసరిన 3కోట్లకు తక్కువ లేకుండా తిన్నాడని చేసిన వ్యాఖ్యను, బాషా ఈ సమావేశంలో ప్రస్తావించాడు. దానితో తెలుగుదేశం ఎమ్మెల్యేలందరికీ శివమెత్తి పోయింది. టన్నుల టన్నుల బియ్యం తేరగా తినడం తప్పు కాదు కాని - మీరు తిన్నారు అని చెప్పడం నేరమట. మొదట మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిరచిరలాడాడు. ఎమ్మెల్యేల మీద ఇంత పరుషమైన వ్యాఖ్య చేసిన జిప సభ్యుడ్ని సమావేశం నుంచి సస్పెండ్ చేయాలని ఆదేశించారాయన. అందు కోసం ఒక తీర్మానం కూడా ప్రవేశపెట్టబోయాడు.

వెంటనే నెల్లూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అందుకొన్నాడు. ఏ తప్పు చేస్తే బాషాను సస్పెండ్ చేస్తారు. అది అతని ఆరోపణ కూడా కాదు. జయప్రకాష్ నారాయణ ఒక టివి కార్యక్రమంలో చేసిన వ్యాఖ్య. దానిని ప్రస్తావించడం తప్పు ఎట్లా అవుతుందని వాదనకు దిగాడు. కాని తెలుగు ఎమ్మెల్యేలు శాంతించ లేదు. ఈలోగా ఉదయగిరి కంభం విజయరామిరెడ్డి వివేకా చెయ్యి పట్టుకొని లాగాడు. దానితో ఇద్దరి మధ్య రచ్చ రేగింది. ఒకరి మీద ఒకరు కలియబడతారా అన్నట్లు వుండింది వాతావరణం. ఇదేదో బాగా వుందే అనుకొని మంత్రి చంద్రమోహన్‌రెడ్డి మరికొంత ఆజ్యం పోసి తమాషా చూడడం మొదలు పెట్టాడు. తమ ఎమ్మెల్యేలను వివేకా విదిలించి కొట్టడం చూసిన మాజీ మంత్రి ఆదాల ప్రభాకరరెడ్డికి కోపం వచ్చింది. ఏమిటి ఎమ్మెల్యేలను కొడతారా అని ఆవేశంగా ప్రశ్నించాడు. వివేకా ఏదో సర్దిచెప్పబోయాడు కాని ఫలితం కన్పించలేదు. రచ్చరేగిపోయింది. కొట్లాడు కోవడం మీ ఉద్దేశ్యమైతే బయటకు రండి తేల్చుకొందాం అని ఆదాల ప్రభాకరరెడ్డి సవాల్ విసిరాడు. దానికి ఆనం రామనారాయణరెడ్డికి ఆవేశం వచ్చింది. ఒకరి మీద ఒకరు అరుపులు కేకలతో సమావేశం హాలు దద్దరిల్లి పోయింది. తెలుగుదేశం ఎమ్మెల్యేలందరూ ఒక ప్రక్క, ఆనం అన్నదమ్ములు ఇద్దరు మరొక ప్రక్క. ఇటువంటి సందర్భాలలో మౌనంగా వుండి, వినోదం చూసే పరసా రత్నం కూడా బస్తీమే సవాల్ అన్నట్లు చొక్కా పైకెత్తి వేదిక దగ్గరకు దూసుక వెళ్లడం విశేషం. ఆవేశాలు అదుపు తప్పిపోయే దశలో ఎందువల్లనో ఆనం రామనారాయణరెడ్డి సర్దుక పోదాం అనే ప్రతిపాదన తెచ్చాడు. అప్పటికే అరిచి అరిచి నోరు నెప్పి పుట్టి వుండేమో - తెలుగు ఎమ్మెల్యేలు కూడా సరే అన్నారు. దానితో ఆ రచ్చ ముగిసింది. కరవుపై చర్చా సమావేశంలో మరొకసారి గలభా. వివేకా ఏదో మాట్లాడబోయేటప్పటికి - చంద్రమోహన్‌రెడ్డి నీది అర్బన్ నియోజకవర్గం! నీకున్నది రెండంటే రెండు పల్లెటూళ్లు; కరవు మీద నువ్వేమిటి మాట్లాడేది, కూర్చో అని దబాయించాడు. దానితో వివేకా కోపం నసాలానికి అంటింది. కరవు మీద మాట్లాడుతుంటే వద్దనడానికి నువ్వెవరు; అర్బన్ ఎమ్మెల్యేలు పల్లెల గురించి మాట్లాడకూడదని మీ ప్రభుత్వమేదైనా చట్టం చేసిందా; కేంద్రం నుంచి కరవు బృందం వస్తే వారికి వూళ్లు చూపడానికి ఒక్క తెలుగు నేత లేడు, నువ్వప్పుడు నెల్లూరులోనే వుండి కూడా ఉదయగిరి వెళ్తే విజయరామిరెడ్డి గొంతు పట్టుకొంటాడని భయపడినట్లున్నావు అని వాదనకు ఎత్తుకున్నాడు. ఆయన నోటికి పోవడం తమ తప్పేనని తెలుసుకున్న మంత్రి ఆ తిట్లు తినలేక నీ ఇష్టం వచ్చింది మాట్లాడుకో అని పక్కకు తప్పుకున్నాడు.

వెంకటగిరి ఎమ్మెల్యే రాజ్యలక్ష్మమ్మ - కరవుపై సుదీర్ఘంగా మాట్లాడారు. నా నియోజకవర్గంలో కరవు తీవ్రత దుర్భరంగా వుంది; ఎన్నిసార్లు కలెక్టర్‌కు విన్నవించుకొన్నా ప్రయోజనం కల్గడం లేదు; కరవుకు ఇన్ని నిధులు వచ్చాయి అని, అన్ని నిధులు వచ్చాయి అని మంత్రులు ప్రకటనలు చేస్తున్నారు;

కాయ 7వ పేజీలో

ప్రజల కోసం - ప్రజల షాపు
మార్కెట్ ధరలకంటే అత్యంత తగ్గింపు ధరలు - ఇది కేవలం `చందన'కే సొంతం
కంచి పట్టు చీరలు, ధర్మవరం, ఆరణి, గద్వాల్‌పట్టు చీరలు, ఫ్యాన్సీ, శిల్క్, వర్క్, సింథటిక్ శారీస్, వ్యాండలూమ్ కాటన్ చీరలు, సూటింగ్స్ & షర్టింగ్స్, రెడీమేడ్స్, కిడ్స్‌వేర్ చుడీదార్స్, డ్రస్‌మెటీరియల్స్
చందన బ్రదర్స్
లేడీస్ & జంట్స్ క్లాత్ షోరూమ్
జి.టి. రోడ్, ఫోన్: 323420
నెల్లూరు
WE ACCEPT MAJOR BANK CARDS

Printed, Published by N. Balendra Prasad at Zamindar Press, Ph: 091-861-327354, Offset Printing at Zamindar Press, Nellore

కాశ్మీర్ ఓటరుకు జేజేలు!

జమ్మూ కాశ్మీర్ శాసన సభ ఎన్నికల మొదటి దశ పోలింగ్ దిగ్విజయంగా ముగిసింది. 47శాతం ఓట్లు పోలైనాయి. కాశ్మీర్ ఇప్పుడున్న పరిస్థితులలో ఈ ఓటింగ్ శాతం అత్యద్భుతమైనది. ఎన్నికలను విఫలం చేయాలని పాకిస్తాన్ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నదో వివరించలేము. పాక్ పాలకుల ప్రేరేపణతో కాశ్మీర్ తీవ్రవాదులు గత నెల రోజులుగా పేట్రేగిపోతున్నారు. ఎన్నికలలో నిలబడిన అభ్యర్థులను, ప్రచారం చేసే నాయకులను, జెండాలు పట్టుకొనే కార్యకర్తలను, బహిరంగ సభలకు వచ్చే సాధారణ జనాన్ని భయపెట్టడానికి విచ్చలవిడిగా హింసకు దిగుతున్నారు వారు. భద్రతాదళాల పహరాలో ఎక్కడ ఏ చిన్న లోపం కన్పించినా, వెనువెంటనే అత్యాధునిక ఆయుధాలతో దాడులకు దిగుతున్నారు. ఈ దాడుల వల్ల ఎందరు అశువులు బాసినా లెక్కచేయడంలేదు. చిన్న పిల్లలు, స్త్రీలు చనిపోతున్నా పట్టించుకోవడం లేదు. ఏమి చేసైనాసరే ఈ ఎన్నికలు జరగనివ్వకుండా చేయాలన్నది పాకిస్తాన్ పట్టుదల. అభ్యర్థులు నామినేషన్ వేసినా, ఓటర్ల పోలింగ్ బూత్‌లకు వెళ్లినా కత్తికొక కండగా నరికి పోగులు పెడతామని బహిరంగ హెచ్చరికలు చేస్తున్నారు. పోటీ చేసే పార్టీ అభ్యర్థి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించి, చుట్టూ పది మంది పోలీసుల పహారాలో భయం భయంగా ఓటర్లను కలుసుకొని ప్రచారం చేసుకోవలసిన దుర్గతి.

ఇంత భయానక వాతావరణంలో 47శాతం మంది నిర్భయంగా పోలింగ్ బూతులకు వచ్చి ఓటు వేసి వెళ్లారంటే- సామాన్యమైన విషయం కాదు. అందులోనూ మొదటిదశ పోలింగ్ జరిగిన నియోజక వర్గాలు పాక్ సరిహద్దుకు సమీపంలో వున్నాయి. సరిహద్దులకు ఆవల కొండలలో , చెట్లమాటున వందలాది మంది తీవ్రవాదులు మకాం పెట్టి వున్నారు. వారి తుపాకీ గుళ్లకు అందేటంత దూరంలో వుండే పోలింగ్ బూతులలో కూడా ఓటర్లు నిర్భయంగా ఓటు చేయడం నిజంగా నమ్మలేని విచిత్రం. ఈ ఓటింగ్ శాతం కల్పితం కాదు; పోలీసుల మాయ కూడా కాదు. 13దేశాల రాయబారులు, వారి సిబ్బంది, వందలాది మంది విదేశీ పాత్రికేయులు డేగకళ్లతో కనిపెట్టి చూస్తుండగా జరిగిన పోలింగ్ ఇది. ఎక్కడో ఒక చోట పోలీసులు బలవంతపెట్టి ఓటర్లను పోలింగ్ స్టేషన్లకు తోలుకవచ్చి వుండినా; లేక పోలీసులే రిగ్గింగ్ వంటి చర్యలకు పాల్పడి వుండినా పోలింగ్ పరిశీలనకు వచ్చిన రాయబారులు, పాత్రికేయులు భూమ్యాకాశాలు దద్దరిల్లేటట్లు గగ్గోలు పెట్టి వుండేవారు. అందువల్ల ఎన్నికల సంఘం చిన్నలోపం కూడా జరగకుండా ఎన్నికలు నిర్వహించడానికి వెయ్యి జాగ్రత్తలు తీసుకొన్నది. ప్రజలు స్వచ్ఛందంగా పోలింగ్ బూతులకు వచ్చి ఓటువేసి వెళ్లారు కాబట్టే, అమెరికా అధ్యక్షుడితో సహా యావత్ ప్రపంచం కాశ్మీర్ ప్రజల ధైర్య సాహసాలకు, ప్రజాస్వామ్యం పట్ల వారికి గల మక్కువకు జేజేలు పలుకుతున్నది.

అమెరికా దేశస్తులకు మరీ విచిత్రం కల్గించాయి ఈ ఎన్నికలు. గత సెప్టంబర్ 11తేది న్యూయార్క్ నగరంలో తీవ్రవాదుల దాడి జరిగితే ఆ దేశ అధ్యక్షుడితో సహా అందరు సీనియర్ ప్రభుత్వాధికారులు భయపడి విమానాలెక్కి, గాలిలో తిరుగుతూ కాలం గడిపారు. తిరిగి ఈ ఏడాది అదే తేది వచ్చేసరికి అమెరికన్ల వెన్నులో చలిపుట్టింది. వారి ఉపాధ్యక్షుడు భయంతో అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయాడు. సాధారణ ప్రజలు విమానాలెక్కడానికి హడలి పోయారు. కొన్నివేల విమాన సర్వీసులు రద్దు చేయవలసి వచ్చింది- ప్రయాణీకులు లేక. ప్రపంచాన్నే పరిపాలించగల శక్తిమంతులమని విర్రవీగే అమెరికన్లు- ఒక్క తీవ్రవాద సంస్థకు జంకి ఇంతగా నీరుగారిపోతే; కరకు కసాయిల వంటి తీవ్రవాదులు హెచ్చరికలు చేసినా జంకు గొంకు లేకుండా, ప్రాణాలను లెక్క చేయకుండా మహిళలతో సహా లక్షలాది మంది ప్రజలు వీధులలోకి రావడం విచిత్రమే కదా? భారతీయుల ఆత్మ విశ్వాసం ఎంత గొప్పదో, ప్రమాదకర పరిస్థితులలో కూడా వారు ఎంత నిబ్బరంగా వ్యవహరించగలరో ప్రపంచానికి చాటి చెప్పారు కాశ్మీర్ ఓటర్లు.

ఈ ఎన్నికలు సజావుగా జరగడంపై కాశ్మీర్ భవిష్యత్తు ఆధారపడి వుంది. ప్రజాస్వామ్యయుతంగా నెగ్గిన ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాశ్మీర్ ప్రజలు భారతదేశం నుంచి విడిపోవాలని కోరుకుంటున్నారని; భారత సైన్యం వారి కోరికను బల ప్రయోగంతో అణచి వేస్తున్నదని; అందువల్లనే కాశ్మీర్ తీవ్రవాదులు అక్కడ స్వాతంత్ర్య పోరాటం జరపవలసి వస్తున్నదని పాకిస్తాన్ అంతర్జాతీయ వేదికల మీద చేస్తున్న ప్రచారం వీగి పోతుంది. తద్వారా కాశ్మీర్ సమస్యకు ఒక పరిష్కారం కనుగొనడానికి అస్కారం ఏర్పడుతుంది. మొదటి దశ పోలింగ్‌లో ప్రజల పాత్ర చూడగానే కాశ్మీర్ విమోచనా సంస్థల సంయుక్త సంస్థ హురియత్ కాన్ఫరెన్స్ నేతలు సందిగ్ధంలో పడిపోయారు. ఎన్నికలలో పాలుపంచుకోమని వారికి ఎందరు ఎన్ని విధాలుగా చెప్పినా విన్పించుకోలేదు. భారత ప్రభుత్వం ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించదని వాదిస్తూ ప్రపంచ నేతలను మభ్యపెట్ట చూశారు. ఇప్పుడా ప్రపంచ దేశాల రాయబారుల కళ్ల ముందే కాశ్మీర్ ప్రజలు ఓటింగ్‌లో స్వేచ్ఛగా పాలు పంచుకోవడంతో హురియత్ కాన్ఫరెన్స్ వాదనలు వీగిపోయినట్లయినాయి. వారి పునాదే ప్రశ్నార్థకంగా మారింది.

మొదటిదశ వలె తతిమా రెండు దశలు కూడా ఇదే తీరులో సజావుగా జరిపించగల్గితే కాశ్మీర్ తీవ్రవాద సంస్థలకు అంతర్జాతీయ సమాజం నుంచి నిరాశ తప్పదు. పాక్ పాలకులు కూడా తమ పిడి వాదనలు మాని, హింసను ప్రక్కనబెట్టి, చర్చల ద్వారా కాశ్మీర్ సమస్య పరిష్కారానికి తమ దేశంలో తల దాచుకొన్న తీవ్రవాద నేతలను ఒప్పించక తప్పదు. ఆ శుభ పరిణామం సంభవించాలంటే ఎన్నికల సంఘం, ప్రభుత్వం, భద్రతా సిబ్బంది మరింత మెళుకువతో, అప్రమత్తతతో మలిదశ పోలింగ్ నిర్వహించాలి. ఈ ఎన్నిక ద్వారా కాశ్మీర్‌లో శాంతి నెలకొంటుందని; భూలోక స్వర్గంగా భాసించే ఆ సీమలో రక్త ప్రవాహాలు నిల్చిపోతాయని ఆశిద్దాం. తమ నిర్భీతి, ఆత్మ విశ్వాసాల ద్వారా ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకున్న కాశ్మీర్ ఓటర్లను మనమూ అభినందిద్దాం; వారికి అండగా నిలబడదాం.

జమీన్‌రైతు

19.9.1952

పేజీలు:12 వెల: 0-2-0

50 ఏళ్ల క్రితం నాటి

తెలంగాణాలో అడ్డం తిరిగిన కథ

తెలంగాణాలో ఇటీవల జరిగిన ఎన్నికల వివరాలను గమనిస్తే కథ అడ్డం తిరిగినట్లు గ్రహించగలరు. ఇప్పుడు ఎన్నిక జరిగిన నాలుగు స్థానాలలో రెండు కాంగ్రెస్‌కు, రెండు కమ్యూనిస్టులకు లభించాయి. గత జనరల్ ఎన్నికలలో కమ్యూనిస్టులకు నూటికి 59ఓట్లు వస్తే, కాంగ్రెస్‌కు 17మాత్రమే వచ్చాయి. కాని ఈ దఫా కమ్యూనిస్టులకు51, కాంగ్రెస్‌కు 49 వచ్చాయి. మొత్తం పోలైన 1,44,805ఓట్లలో కాంగ్రెస్‌కు 68,934ఓట్లు, కమ్యూనిస్టులకు 74,127ఓట్లు వచ్చాయి. అంటే తెలంగాణాలో గూడా కమ్యూనిస్టులకు ఆశ్రయం లేకుండా పోతున్నదన్నమాట.

మంగళగిరి నానాదాస్ పార్లమెంట్ సభ్యత్వం

మంగళగిరి నానాదాస్ నెల్లూరు వుత్తర నియోజక వర్గం నుండి నిమ్న జాతుల రిజర్వుడ్ సీటులో పార్లమెంటుకు ఎన్నికయ్యాడు. కాని ఎన్నికల అనంతరం నానాదాస్ హరిజనుడు గాదని, క్రిశ్చియనని, అందువల్ల అతని ఎన్నిక చెల్లదని ఒక అభ్యర్థి ఎలక్షన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశాడు. విచారణ పూర్తయ్యి, అతను హరిజనుడు కాదని తెలిసినప్పుడు ఆ సభ్యత్వం రద్దుకావచ్చు.

నెల్లూరు నీటి సరఫరాకు రైతుల సమావేశ సూచన

తుంగభద్ర నీరు నెల్లూరుకు లభింపజేసే అవకాశాలను గూర్చి ఆలోచించి ప్రభుత్వం ద్వారా దానిని నెరవేర్చుకొనుటకు జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యాన 7తేది నెల్లూరులో రైతుల సమావేశం జరిగింది. శ్రీ లేబూరు సుబ్బరామరెడ్డిగారు అధ్యక్షత వహించారు.

కృష్ణానది నీళ్లు పెన్నాకు రప్పించుటకు సంగమేశ్వరం వద్ద, నందికొండవద్ద ఆనకట్టలు కట్టవలెనని, కర్నూలు జిల్లాకు కడప జిల్లాలోని గండికోట ప్రాజెక్టుకు, నెల్లూరుజిల్లా పెన్నాకు దక్షిణంగా వుండే తాలూకాలకు, మద్రాసుకు ఈ రిజర్వాయరు నుండి నీటిని సప్లయి చెయాలని, ఈ నీటి సప్లయికి సరిపోయినంత మాత్రమే సిద్దేశ్వరం ఆనకట్టను కట్టవలెననీ సోమశిల వద్ద తక్కువ ఎత్తులో ఆనకట్ట కట్టి, రిజర్వాయర్ నిర్మించినందువల్ల కడపజిల్లాలో మునక ప్రదేశం చాలా

తరువాయి 10వ పేజీలో

జనవాణి

ఆరోపించే ముందు ఆలోచించారా?

నెల్లూరు జర్నలిస్ట్స్ కాలనీలో సి.వి. శేషారెడ్డి "తానుకూడా విలేఖరిననే తప్పుడు సర్టిఫికేట్ సృష్టించి ఇల్లు తీసుకొన్నాడంటూ" ఇటీవల నెల్లూరు బిజెపి నేతలు, జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారని, దాని మీద శేషారెడ్డి ఇంటి ముందు ధర్నా జరపాలని కూడా అనుకొని "ఆ తర్వాత ఎందువల్లనో విరమించుకొన్నా"రని "జమీన్‌రైతు (ఆగస్టు 30వతేది పత్రిక)లో చదివాను. శేషారెడ్డి " తప్పుడు సర్టిఫికేట్ సృష్టించి" ఇల్లు తీసుకొనే వుంటే, బిజెపి ఆందోళనకు పూనుకొనడం సబబే; కానీ వారి ఆరోపణ నిరాధారమైతే, ధర్నా విరమించుకోవడానికి కారణం తమ ఆరోపణ వాస్తవం కాకపోవడమే అయితే, తొందరపడి నింద వెయ్యడం అనుచితం. జర్నలిస్ట్ కాలనీలో ఇళ్ల కేటాయింపు గురించి సాధికారికంగా చెప్పగలిగిన ఆనాటి సీనియర్ జర్నలిస్టులెవరూ ఇప్పుడు లేరు. మొట్టమొదట - 1969లో కాబోలు-ప్రభుత్వం నెల్లూరు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు యిచ్చినప్పుడు ఆ సమావేశంలో నేనున్నాను. నెల్లూరు కో ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లుకు చెందిన కొంత స్థలాన్ని జర్నలిస్టులకు కేటాయించారు. తర్వాత మేము జర్నలిస్టుల కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటిని ఏర్పరచి, ఇళ్ల స్థలాలు రిజిస్టర్ చేసుకొన్నాం. ఈ మొదటి ప్రయత్నంలో మాతో పాటు సి.వి.శేషారెడ్డి ఉన్నాడు. ఆయన మావెంట జాయింట్ కలెక్టరు వద్దకు వచ్చి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు యివ్వవలసిందిగా కోరాడు. అక్కడికక్కడే తయారుచేసిన జాబితాలో సి.వి. శేషారెడ్డి పేరు కూడా వుంది. ఆనాటికి అది టౌన్‌కు చాలా దూరంగా వుండడం వల్ల మొదట్లో చాలా మంది జర్నలిస్టులు ఉత్సాహం కనబర్చలేదు. అయితే మాలో కొందరు పట్టుబట్టి అందర్ని సభ్యులుగా చేర్పించారు. అప్పటికి శేషారెడ్డి 'జమీన్ రైతు' గ్రామీణ విలేఖరి అనే పేరుతోనే స్థలం తీసుకొన్నాడు. సర్టిఫికేట్ వుందో లేదో తెలియదు కానీ, అప్పట్లో అలాంటి సర్టిఫికేట్ ఎవరికీ అవసరం వుండేది కాదు. నాకే కాదు, చుండి విశ్వనాథం, నల్లమోలు గోపాలకృష్ణయ్య, కొట్రా ఆదిశేషయ్య లాంటి సీనియర్ విలేఖరులకు కూడా ప్రభుత్వం నుంచి అక్రెడిటేషన్లంటూ వుండేవి కాదు. మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు చాలా కాలం ఖాళీగా వుండి పోయాయి. తర్వాత 1974లోనో 75లోనో ఏపి హౌసింగ్ బోర్డు కొంత డబ్బు మంజూరు చేసి ఇళ్లు కట్టించి యిచ్చింది. అలా మా అందరితోపాటు శేషారెడ్డికి అక్కడ ఇల్లు వచ్చింది. ఇందులో ఆయన "తప్పుడు సర్టిఫికేట్ సృష్టించింది" లేదు; దొంగతనంగా ఇల్లు సంపాదించింది లేదు. జర్నలిస్ట్ కాలనీ అని పేరే కానీ, అందులో ఇళ్లు పొందిన వారందరూ జర్నలిస్టులు కాదు. జర్నలిస్టులు కాని వారికి ఇళ్లు యిచ్చారన్నది వేరే విషయం. ఇదంతా తెలుసుకోకుండానే బిజెపి నేతలు కలెక్టరుకు ఫిర్యాదు చేశారా? అయినా వెంకయ్యనాయుడు మీద వచ్చిన ఆరోపణకు విరుగుడు శేషారెడ్డి మీద ఆరోపణా? పెట్రోలు పంపుల కేటాయింపుల్లో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణకు సమాధానంగా కాంగ్రెస్ వాళ్లు మాత్రం తక్కువ తిన్నారా? వాళ్లు తమ హయాంలో అదే పని చేయలేదా - అని బిజెపి నేతలు ఆరోపించినట్లుంది ఇది!

హైదరాబాద్ ఒకనాటి
'జమీన్‌రైతు' గోపి


బాక్స్‌టైప్ బ్రిడ్జి మూణ్ణాళ్ల ముచ్చటే

నెల్లూరు విజయమహల్ వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణం కోసం దశాబ్దకాలానికిపైగా ఉద్యమాలు జరిగాయి. కాని ఆ తర్వాత చేపట్టిన బ్రిడ్జి నిర్మాణమే బాధమిగిల్చింది. ప్రారంభానికి

తరువాయి 10వ పేజీలో

పిచ్చితల్లిపై అత్యాచారం!

నెల్లూరు దర్గామిట్టలోని రాజ రాజేశ్వరమ్మ గుడి ప్రాంతంలో మంగళ వారం రాత్రి అభం, శుభం తెలియని పిచ్చితల్లిపై పీకలదాకా మద్యం సేవించిన కామాంధుడొకడు అత్యాచారానికి ఒడిగట్టాడు. ఎక్కడ నుంచి వచ్చిందో ఏమో తెలియదు; ముప్పై సంవత్సరాల వయస్సుండే మతి స్థిమితంలేని మహిళ పగలంతా రాజేశ్వరమ్మ గుడిముందు కూర్చుని వుంటుంది. దయతలచిన వాళ్లు



పావలో, అర్ధరూపాయో సాయం చేస్తారు. ఎవరైనా ఏదైనా పెడితే తిని రాత్రి వేళల్లో దేవాలయం ముందు బస్ షెల్టర్‌లో పడుకొంటుంది. చంటిబిడ్డ మనస్థత్వం గల ఈ అభాగ్యురాలిని మంగళవారం రాత్రి 12గంటల ప్రాంతంలో దేవాలయం ముందు ఆటో దిగిన వ్యక్తి, బస్ షెల్టర్ వద్దకు వెళ్లి నిద్ర లేపాడు. ఆమెను బలవంతంగా లాక్కొని వెళ్తుంటే ఆ సమయంలో స్కూటర్లపై వెళ్తున్న వ్యక్తులు, భార్య భర్తల తగాదా అనుకొని పట్టించుకోలేదట. ఈ కామాంధుడు ఈ పిచ్చి తల్లిని పెద్దాసుపత్రి గోడ ప్రక్కనే వున్న పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత చినిగిన దుస్తులతో ఆ పిచ్చి తల్లి ఆటువైపు వెళ్తున్న వారిని 'నన్ను ఏమి చేయకండి, నన్ను వదలివేయండని' కేకలు పెడుతుంటడాన్ని పలువురు చూశారు. అత్యాచారం చేసిన వ్యక్తి పొదలకూరు రోడ్డు, బద్వీ కాలనీ, లేదా ప్రగతినగర్ ప్రాంతీయుడై వుంటాడని కొందరు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ వ్యక్తి ఈ ప్రాంతంలో తాగి తిరగడం కూడా చూశామంటున్నారు. పట్టణ నడిబొడ్డులో మరోసారి ఇటువంటి దారుణ సంఘటన జరగకుండా ఈ వ్యవహారంపై పోలీసులు కూలంకష దర్యాప్తు జరిపి కామాంధుడిని పట్టుకొని కటకటాల వెనక్కు పంపాల్సి వుంది.

రామ్‌నగర్‌లో తిష్టవేసిన సమస్యలు

నెల్లూరు రామ్‌నగర్ ప్రాంతంలో కనీస సౌకర్యాల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం మీదుగా అదనపు ఎస్పీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు సంవత్సరాల తరబడి గుంటల మయంగా వున్నా పట్టించుకొనే నాధుడే లేడు. ఈ ప్రాంతంలో నివసి

తొరవ 11వ పేజీలో

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల దోపిడీ!

నెల్లూరు చుట్టుప్రక్కల వున్న ప్రైవేటు మెడికల్, డెంటల్, ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఫీజులు వసూళ్లు చేసే పద్ధతి దోపిడీదొంగలను మరిపింపజేస్తుంది. ఫీజుల వసూళ్లలో పారదర్శకత లేకపోగా ఇష్టమొచ్చిన



తీరులో వసూలు చేస్తున్నారు. యాజమాన్యపు కోటా క్రింద కొచ్చే సీట్ల వ్యవహారంలో ఈ ఫీజుల దోపిడీ మరీ జాస్తిగా వుంది. కౌన్సిలింగ్‌లో ప్రైవేటు కాలేజీల్లో ఫ్రీ సీటు దొరికినా ఈ ఫీజుల దోపిడీ ఆగడం లేదు. మామూలుగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కౌన్సిలింగ్‌లో సీటు లభించిన వెనువెంటనే 2500 రూపాయలు డిడి రూపంలో చెల్లించాలి. సీటు కేటాయించిన కళాశాలకు 8500 రూపాయలు స్పెషల్ ఫీజు రూపంలో జమ చేస్తే సరిపోతుంది. హాస్టల్, మెస్ బిల్లుల పద్దులో నెలకు వెయ్యి రూపాయలు చెల్లిస్తే చాలు. మొత్తం మీద ప్రభుత్వ కాలేజీల్లో సీటు వస్తే సంవత్సరానికి 25వేలు సరిపోతాయి. అదే ప్రైవేటు కాలేజీలైతే కౌన్సిలింగ్ సమయంలో సీటు వచ్చిన వెంటనే 4500 రూపాయలు డిడి కట్టాలి. రెండు రోజుల వ్యవధిలోనే కళాశాలలో అడ్మిషన్ ఫీజు క్రింద మరో 18,000 చెల్లించాలి. బిల్డింగ్ ఫండ్ క్రింద 30వేలు, హాస్టల్ ఫీజుగా 40వేలు అప్పటికప్పుడే కట్టాలి. ఈ లెక్కన సంవత్సరానికి ఒకటిన్నర లక్ష భర్చవుతుంది.

తొరవ 11వ పేజీలో

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం

దుర్గామిట్ట, నెల్లూరు -4, ఫోన్ : 322016



తేది: 7-10-2002 నుండి తేది: 15-10-2002 వరకు జరగబోవు "శరన్నవరాత్రోత్సవములు" సందర్భముగా "నిత్యపూజలకు" గాను

సహస్రనామము - 10 రోజులు	రూ. 200-00
శ్రీదేవి భద్గమాల - 10 రోజులు	రూ. 100-00
అష్టోత్తరము - 10 రోజులు	రూ. 30-00
సామూహిక నవావరణం - ఒక్కరోజు	రూ. 400-00

ఉ॥ 7గం॥ నుండి 9 గం॥

చెల్లించి శ్రీ అమ్మవారి పూజలో పాల్గొని భక్తులు శ్రీ అమ్మవారి అనుగ్రహమును పొందవలెనని కోరుచున్నాము.

భవదీయులు

శ్రీ రత్నం సుందర రాజు M.Com., ధర్మకర్తలకు కుటుంబసభ్యుడు

దాగంటి సూర్య ప్రసాదరావు B.A., నిర్వాహకాధికారి

గమనిక: 1) సంవత్సరమునకు ఒక్కసారి మాత్రమే చేయు శ్రీ అమ్మవారి "మహాభిషేకము" తేది: 15-10-2002, "విజయదశమి" పర్వదినం 4 గంటలకు జరుపబడును. కావున భక్తులు దేవస్థానము కార్యాలయము నందు రూ. 116/-లు ముందుగా చెల్లించి రసీదు పొందవలెను. అభిషేకమునకు కావలసిన పూజా సామగ్రి వారే తెచ్చుకొనవలెను. 2) శ్రీ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు - రవికెలు ప్రతి రోజు ఉ॥ 9గంటల నుండి మరియు సా॥ 6 గంటల నుండి బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును. 3) అమ్మవారికి సమర్పించు కానుకలు దేవస్థానం కార్యాలయములో చెల్లించి రసీదు పొందగలరు. 4) ఆలయ సహాయ కమీషనర్ వారి అనుమతి లేని ప్రకటనలకు దేవస్థానం బాధ్యత వహించదు.



దోపిడీ ద[illegible]ను అరెస్టు చేసి వారి వద్ద నుండి 7లక్షల విలువగల బంగారు నగలు స్వాధీనపరుచుకున్న సందర్భంలో దొంగలు గురించి సమాచారం రాబట్టినందుకు జిల్లా ఎస్పీ రాజేంద్రనాథ్‌రెడ్డి నుంచి రివార్డు అందుకుంటున్న నెల్లూరు టూ టౌన్ ఎస్‌ఐ విజయభాస్కర్, పక్కన క్రైం సిఐ భగీరథలాయి, డిఎస్పీ రాజగోపాల్ వున్నారు.

ప్రబలుతున్న ప్రాణాంతక వ్యాధులు

నెల్లూరు పట్టణంలో ముగ్గురు పిల్లలకు అత్యంత ప్రమాదకరమైన డెంగ్యూజ్వరం సోకిందన్న విషయం అధికార పూర్వక నిర్ధారణ అయ్యింది. మరో ఐదుగురు పిల్లలకు మెదడువాపు వ్యాధి వచ్చింది. ఇవి చాలవన్నట్లు వైరల్ జ్వరాలొచ్చిన వందలాది మంది పిల్లలతో పట్టణంలోని అన్ని చిన్నపిల్లల అసుపత్రులు కిటకిట లాడు తున్నాయి. ఇంత ఉపద్రవం ముంచుకొచ్చినా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధి కారులు, ఇతర ఉన్నతాధికారులుగానీ ఈ విషయాన్ని అసలు ఇప్పటి వరకు పట్టించు కోలేదు. విషయ తీవ్రతపై ప్రభుత్వానికి చిన్న పాటి నివేదిక కూడా పంపలేదు. యుద్ధ ప్రాతిపదిక మీద పట్టణంలోని పరిసరాల శుభ్రత చర్యలు చేపట్టకుంటే వందలాది పిల్లల ప్రాణాలకు ముప్పు తప్పదని పట్టణంలోని చిన్నపిల్లల వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో డెంగ్యూజ్వరం వచ్చి ఒకరు మరణించడంతో ఈ విషయమై గందరగోళం ప్రారంభమయ్యింది. వాస్తవానికి ఇంతకంటే ముందు ఈ యేడాది మే నెలలో నెల్లూరులో డెంగ్యూ జ్వరం కేసు నమోదయ్యింది. దర్గామిట్టకు చెందిన చాణుక్య అనే పిల్లవాడికి వచ్చింది డెంగ్యూ జ్వరమేనని బెంగుళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజి

ముగ్గురికి డెంగ్యూ జ్వరం
ఐదుగురికి మెదడు వాపు
వందలాది మందికి వైరల్‌జ్వరాలు

నిర్ధారించి నివేదిక పంపింది. పట్టణంలోనే పెథాలజిస్ట్ విఆర్‌రెడ్డి తోపాటు, సింధూర నర్సింగ్ హోమ్‌కు చికిత్సకోసం వచ్చిన మరో బాలునికి సైతం వచ్చింది డెంగ్యూ జ్వరమేనని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజి పేర్కొంది. రేబాల వారి వీధిలోని చిన్నపిల్లల ఆసుపత్రికి జ్వరంతో బాధ పడుతూ వచ్చిన ఐదుగురు బాలల రక్తంతీసి పరీక్షకు పంపగా చిట్టమూరు, ముత్తుకూరుకు చెందిన ఇద్దరు బాలలకు మెదడువాపు వ్యాధి సోకిందని నిర్ధారణ అయ్యింది. డెంగ్యూ, మెదడువాపు వ్యాధుల విజృంభణ సీజన్ రాకముందే జిల్లాలో ఇన్ని కేసులు నమోదు కావడం ప్రమాద ఘంటికలే. వర్షాలు పడడం మొదలైతే పరిస్థితి మరింత దారుణంగా తయారవ్వడం ఖాయం. వైరస్ జ్వరంతో పట్టణంలోని ప్రతి చిన్న పిల్లల ఆసుపత్రికి నిత్యం గత వారం రోజులుగా 150మంది పైగా పిల్లలొస్తున్నారు. వైరల్ ఫీవర్‌కు పట్టణంలోని ఆసుపత్రుల్లో ప్రస్తుతం 600మంది పైగా పిల్లలు చికిత్స పొందుతున్నారు. నెల్లూరు మునిసిపాలిటి మురికి రాజకీయ కంపులో చిక్కుకపోయి పట్టణంలోని పరిసరాల పరిశుభ్రత వ్యవహారాన్ని మర్చి పోయారు. ఇప్పటికీ పాలకులు, అధికారులు స్పందించి తక్షణ పరిరక్షణ చర్యలు తీసుకోకుంటే పలువురు చిన్న

తొరవ 11వ పేజీలో

పొదుపులక్ష్ములకు బ్యాంకర్లు అండగా వుండాలి

పొదుపులక్ష్మి గ్రూపు మహిళా సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు బ్యాంకు అధికారులు పూర్తిగా సహకరించాలని జిల్లాకలెక్టర్ అనంతరాము చెప్పారు. బుధవారం నాడు గోల్డన్ జూబ్లీహాలులో స్వయం సహాయక బృందాల ఆర్థిక పరిపుష్టిపై బ్యాంకర్లతో నిర్వహించిన వర్క్‌షాపులో కలెక్టరు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 18వేల పొదుపు లక్ష్మి గ్రూపులు బ్యాంకులద్వారా నేరుగా రుణాలు పొంది తమ స్వయం ప్రతిపత్తిని చాటుకొన్నాయి. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని మరిన్ని రుణాలను స్వయం సహాయక గ్రూపులకు అందించాల్సి వుందన్నారు. బ్యాంకర్లద్వారా విడుదలైన రుణాలకు నాబార్డ్ ద్వారా రీఫైనాన్స్ చేస్తున్నందువల్ల రికవరీలో వెసులుబాటు వుందన్నారు. వెలుగు పథకాన్ని బ్యాంకులకు అనుసంధానం చేసి కార్యక్రమాలు అమలు జరుపుతామన్నారు. డ్వాక్రా డైరక్టర్ వై.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ స్వయం సహాయక గ్రూపులకు విడుదల చేసిన రుణాల రికవరీలో ప్రభుత్వాధికార్లు, బ్యాంకర్లు సమన్వయంతో కార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ పొదుపు సంఘాలను చైతన్యవంతం చేసేందుకు డిఆర్‌డిఏ ఇందుకూరుపేట, నాయుడుపేట, బుచ్చిరెడ్డిపాళెం, ఉదయగిరిలలో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. వెలుగు ప్రాజెక్ట్ డైరక్టరు సంపత్‌కుమార్, సిండికేటు బ్యాంక్ లీడ్ మేనేజర్ వి.చంద్రశేఖర్, నాబార్డ్ అసిస్టెంట్ జిఎం శ్రీనివాసమోహన్, విద్యాసాగర్‌రెడ్డి, పలువురు బ్యాంకు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జిల్లాకలెక్టర్ సలహా
కొత్తూరులో 150మందికి అతిసారం!

నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు పంచాయితీ పరిధిలోని టైలర్స్ కాలనీ ప్రజలను అతిసారవ్యాధి గడగడలాడించింది. ఈ వారంలో కాలనీకి చెందిన 150మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. కాలనీలో మంచినీటి సౌకర్యం లేదు. మురుగుకాల్వలు లేవు. దీనివల్ల ఇళ్ల ముందు మురుగునీరు చేరి పలు వ్యాధులొస్తుయని ఈ ప్రాంతీయులు లబోదిబో మంటున్నారు. అతిసారవ్యాధి సోకిన విషయాన్నిఎఐవైఎఫ్ నాయకులు తక్షణం జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. అల్లీపురం పీహెచ్‌సి డాక్టర్ బ్రిజిత, ఎ.ఎన్.ఎం పంపాదీజేగం ఇక్కడే తిష్టవేసి వైద్య సౌకర్యం అందజేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. వర్షాకాలంలో పరిస్థితులు మరింత క్షీణించకుండా అధికారులు మంచినీటి, డ్రైనేజి వసతులు కల్పించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ఎన్టీఓ కాలనీలో నీటి ఎద్దడి

నెల్లూరు భక్తవత్సలనగర్ ఎన్టీఓ కాలనీ సాయిబాబా గుడి ప్రాంతంలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొనివుంది. గత పది రోజులుగా తమకు మునిసిపాలిటి మంచినీటిని సరఫరా చెయ్యడం లేదని ఈ ప్రాంతీయులు ఆరోపిస్తున్నారు. బోర్లు కూడా నీరులేక పోవడంతో ప్రత్యామ్నాయ మంచినీటి సౌకర్యం లేక నానా తంటాలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో సైతు కాలువలలో పూడిక తీయక పోవడంతో మురికి నీరంతా రోడ్లపై మడుగులుకట్టి ప్రవహిస్తోందన్నారు. వీధులలో ఎక్కడి చెత్త అక్కడే పేరుక పోయివున్నా పట్టించుకొనే వారులేరని ఈ ప్రాంతీయులు లబోదిబో మంటున్నారు.

కోటి రూపాయల బ్రిడ్జికి అప్పుడే పగుళ్లు!

వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి వద్ద ఉప్పువాగుకు అడ్డంగా కోటి రూపాయలమేర ప్రపంచ బ్యాంక్ నిధులతో నిర్మాణం పూర్తి చేసుకొన్న బ్రిడ్జికి ఏడాది గడవక ముందే పగుళ్లు ఏర్పడ్డాయి. అధికార్ల నిర్లక్ష్యమో, కాంట్రాక్టరు స్వార్థమో తెలియదుగాని బ్రిడ్జి మూడు కోణాల పరిధిలో నిట్టనిలువుగా నెర్రిలిచ్చింది. ఈ కాంట్రాక్ట్‌ను కెఎంసి సంస్థ తీసుకొని మరొకరికి సబ్‌కాంట్రాక్టు ఇచ్చింది. దీన్ని చేపట్టిన సబ్ కాంట్రాక్టర్లు బాధ్యతగా పనులు చేయకపోవడం,

కాంట్రాక్ట్ పొందింది ఒకరు పనిచేసింది మరొకరు

నిత్యం సైట్‌లోనే ఉండి పనులు చేయించాల్సిన అధికార్లు పట్టించుకోక పోవడం వల్ల పనులు నాసిరకంగా జరిగి పగుళ్లు ఇచ్చినట్లు ఇక్కడ చర్చించుకొంటున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగేటప్పుడు, జరిపిన తర్వాత ఒకటికి రెండు సార్లు విజిలెన్సు, క్వాలిటీ కంట్రోలు అధికార్లు, నిపుణులు తనిఖీలు చేసినా నాసిరకం మెటీరియల్స్ వాడకాన్ని నిరోధించలేక పోయారనే విమర్శలున్నాయి. సంబంధిత శాఖాధికార్లు జోక్యం చేసుకొని తక్షణమే పగుళ్లు నివారణకు చర్యలు చేపట్టకపోతే, కోటి రూపాయలు ఉప్పువాగులో పోసినట్లువుతుంది.

కాంట్రాక్టు రంగంలో ఎంతో పేరున్న కెఎంసి సంస్థ వారు చేతకాని సబ్ కాంట్రాక్టర్లకు పనులుఅప్పగిస్తే వారి పేరు గబ్బుపట్టడం ఖాయం.

మంత్రితో బాగుంటా - కంభం ప్రకటన!

జిల్లామంత్రిగా ఎవరున్నా గౌరవించడం శాసనసభ్యునిగా తన కర్తవ్యమని విజయరామిరెడ్డి నొక్కి చెప్పారు. ఆదాల ప్రభాకరరెడ్డి మంత్రిగా వుండగా ఆయనకు ఇవ్వాల్సిన గౌరవమర్యాదలిచ్చి నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి పనులు సాధించుకొన్నానని, అలాగే ప్రస్తుత మంత్రి సోమిరెడ్డితో కూడా అదే రీతిలో వ్యవహరించి అభివృద్ధి పనులు సాధించుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానన్నారు. ఉదయగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నానని ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి చెప్పారు. జమీన్‌రైతుతో గురువారం మాట్లాడుతూ జన్మభూమి పథకం ద్వారా నియోజకవర్గంలో 20కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు రూపుదిద్దుకున్నాయని అలాగే పనికి ఆహారం క్రింద 11కోట్లతో పనులు చేపట్టామన్నారు. ఈ ఏడాది కోటి రూపాయలతో 40 చెరువులకు ప్రత్యేక మరమ్మత్తులు జరుగుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో ముఖ్యంగా సాగు, తాగు నీరు, రవాణా,

తొలవ 7వ పేజీలో



INAGURATION OF
FREE HEALTH CENT

కలిచేడు వాసి నెల్లూరులో పేరుగాంచిన పిల్లల డాక్టర్ రవి స్వగ్రామంలో ఉచిత వైద్యశాలను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ అనంతరాము. వేదికపై గూడూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యంరెడ్డి, డాక్టర్ రవి దంపతులు

పనికి ఆహారం బియ్యం - స్టాక్‌పాయింట్లోనే మాయం!

'పనికి ఆహారపథకం' బియ్యం ఒక వైపు అక్రమంగా నల్లబజారుకు తరలి వెళ్తుంటే మరోవైపు అసలు బియ్యాన్నే తరలించకుండా మిల్లర్ల దగ్గర నుంచి డీలర్లవరకు బియ్యం ముట్టినట్లు బిల్లులను చేరవేస్తూ ఓ దళారి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నాడు. ఈ 'దళారి'తో చేతులు కలిపినందుకు గాను నెల్లూరు ఎఫ్‌సిఐ, రాపూరు స్టాక్ పాయింట్ అధికారులకు పెద్ద ఎత్తున మామూళ్లుముడుతున్నాయి.

ప్రభుత్వం అనుమతి పొందిన మిల్లర్ల నుంచి నెల్లూరు ఎఫ్‌సిఐ వారు కొనుగోలు చేసిన బియ్యాన్ని రాపూరు స్టాక్ పాయింటుకు చేరుస్తారు. రాపూరు స్టాక్ పాయింట్‌నుంచి కలువాయి, చేజెర్ల, పొదలకూరు, రాపూరు మండలాలలో జరిగే పనికి ఆహార పథకం పనులకు గాను ఆయా మండలాల ఎమ్మార్వోల నివేదిక ప్రకారం సంబంధిత గ్రామాల

రాపూరు స్టాక్ పాయింట్‌లో వర్ధిల్లుతున్న అవినీతి

డీలర్లకు బియ్యాన్నిచేరవేస్తారు. గ్రామాలలో జరిగే పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు ఏరోజు కారోజు పనిలోకి వచ్చిన కూలీలకు డబ్బుకు ప్రత్యామ్నాయంగా, అందుకు సరిపడే బియ్యాన్ని కూపన్ల రూపంలో చెల్లిస్తారు. కూలీలు ఆ కూపన్లు తీసుకెళ్లి డీలర్లకు ఇస్తే డీలరు కూలీలకు బియ్యం పంచుతాడు. జరగాల్సిన పద్ధతి ఇదికాగా అసలు బియ్యాన్నే మిల్లర్ల వద్దనుంచి కదల్చకుండా మిల్లర్ల నుంచి నెల్లూరు ఎఫ్‌సిఐకి, ఎఫ్‌సిఐ నుంచి రాపూరు స్టాక్ పాయింట్‌కు, అక్కడి నుంచి గ్రామాల డీలర్లకు, డీలర్లనుంచి కూలీలకు బియ్యం ముట్టినట్లు రశీదులు వ్రాస్తూ రికార్డులలో చూపుతున్నారే తప్ప ఎక్కడా బియ్యం కూలీలకు ఇస్తున్న దాఖలాలు లేవు. ఈ మొత్తం వ్యవహారంలో పొదలకూరుకు చెందిన రైసుమిల్లు యజమాని ప్రధాన భూమిక పోషిస్తున్నాడు.

ఇతను మిల్లర్ల నుంచి ఎఫ్‌సిఐకు, ఎఫ్‌సిఐ నుంచి రాపూరు స్టాక్ పాయింట్‌కు, రాపూరు స్టాక్‌పాయింట్‌నుంచి గ్రామాల డీలర్లవద్దకు మోటారుబైక్‌పై స్వయంగా వెళ్లి పంపిణీ జరగాల్సిన బియ్యం సమాచారాన్ని సేకరిస్తాడు. చివరగా ఆయా పనుల కాంట్రాక్టర్లతో లాబీ నడిపి అసలు విషయం వివరిస్తాడు. మీకు ఇక్కడికి 'బియ్యం' రావడం మీరు అమ్ముకోవాలని చూడటం, విజిలెన్సు వారికి పట్టుబడడం,

తొలవ 8వ పేజీలో

విద్యుత్‌కోతతో నాయుడుపేట సీతమతం

నాయుడుపేటలో విద్యుత్ శాఖాధికారులు ప్రతినిత్యం 14గంటలు విద్యుత్ కోత విధిస్తున్నారు. దీని వల్ల వ్యాపారస్తులు, చిన్న చిన్న పరిశ్రమలు నడుపుకొనే వారు ఇబ్బందులు పడుతున్నారు. పని వేళల్లో కరెంట్ వుండడం లేదు. రాత్రి పదిగంటల తర్వాత అంగళ్లు తెరచి వుంటే పోలీసులు ఒప్పుకోవడం లేదు. అర్ధరాత్రి విధిస్తున్న కోతకు వృద్ధులు, చిన్న పిల్లలు అల్లాడిపోతున్నారు. ఫ్యాన్లు తిరగక దోమల దెబ్బకు రాత్రివేళల్లో నిద్రకరవవుతోంది. రాత్రి వేళల్లో విద్యుత్ కోత విధించిన సమయంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే పరసా రత్నం నాయుడుపేటలో వున్నప్పుడు విద్యుత్ కోత విధించడం లేదు. విద్యుత్ కోత వేళలు ముందుగా ప్రకటించి వాటిని అమలు పరిస్తే బాగుంటుందనేది ప్రజల వాదన. కాని దీన్ని పట్టించుకొనే వారెవరు?

బుచ్చిలో బోగస్ టీచర్లు

జిల్లాలో ఇంతకు ముందు జరిగిన టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌లో బోగస్ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు సంపాదించిన పలువురు బుచ్చిలో జల్సాగా ఉద్యోగాలు చేసుకొంటున్నారు. తప్పుడు అంగ వైకల్యం, అనుమతించని యూనివర్సిటీల బయిడి సర్టిఫికేట్లు పెట్టి ఉద్యోగం చేస్తున్న వారు దాదాపు 10మంది దాకా వున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న వారిలో ఇద్దరు చెముడు, మూగ సర్టిఫికేట్లతోను, ఒకరు అంధత్వం క్రింద, మిగిలిన ఏడు మంది భోపాల్, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాల్లోని అర్హత లేని యూనివర్సిటీల బయిడి సర్టిఫికేట్లు దాఖలు చేసి ఉద్యోగాలు పొందారు. వీరంతా 94, 98, 2001లలో జరిగిన డిఎస్సీలో ఉద్యోగాలు పొందడం విశేషం. 2001లో జరిగిన డిఎస్సీలో బోగస్ సర్టిఫికేట్లతో భార్యాభర్తల కోటా క్రింద (స్పౌస్) దొంగ సర్టిఫికేట్లు పెట్టి దగదర్తి, సంగం మండలంలో పని చేస్తుండటం విశేషం. ఒక టీచరు అయితే అసలు తన కుల ధృవీకరణ పత్రాన్నే మార్చివేసి ఎక్కువ రిజర్వేషన్ గల కుల ధృవీకరణ పత్రంతో పని చేస్తుండటం అధికారుల అవినీతికి అద్దం పడుతోంది. కర్నూలు

జిల్లావార్తలు

జిల్లాలో వెలుగు చూసిన బోగస్ ఉపాధ్యాయుల స్కాంతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఇదే తరహాలో బోగస్ సర్టిఫికేట్స్ బయటపడడంతో విద్యాశాఖ కమిషనర్ మన్మోహన్‌సింగ్ గత జూలై నెలలో అన్ని జిల్లాల కలెక్టర్లను ఈ విషయమై విచారణ జరపమని కోరారు. అన్ని జిల్లాల సంగతి ఎలా వున్నా నెల్లూరు జిల్లాలో మాత్రం విచారణనకే లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి బోగస్ ఉపాధ్యాయుల పని పట్టాల్సిన అవసరం వుంది.

పొదలకూరులో వ్యభిచారం

పొదలకూరులో ఇటీవల కాలంలో వ్యభిచారం ఎక్కువైంది. గతంలో రాజకీయ నాయకుల అండతో వ్యభిచార గృహాలను రౌడీలు నడిపేవారు. కాల క్రమేణా పోలీసు దాడులతో అవి అంతరించి పోయాయి. ఇటీవలి కాలంలో పంచాయితీ బస్టాండ్‌లో సాయంత్రం సమయంలో పల్లెలనుంచి వ్యభిచారులు రావడం పురుషులను ఆకర్షించి, వారితో వెళ్లిపోవడం జరుగుతూంది. పట్టణంలో కొందరు ఎస్‌టిడి యజమానులు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొనేందుకు వ్యభిచారం చేసేమహిళలను నెలజీతాలిచ్చి బూత్‌లలో ఉంచడంద్వారా పురుషులు వారికోసం ఏపని లేకున్నా లోకల్‌కాల్ చేసేందుకని వెళ్లడం వారితో పరిచయం చేసుకోవడం జరుగుతూంది. ఎయిడ్స్‌వ్యాధి సోకి పొదలకూరులో ఇప్పటికి ఇద్దరు యువకులు చనిపోవడంతోపాటు మరో పదిమందికి పైగా ఈ వ్యాధితో బాధ పడుతున్నారు. పోలీసులు తక్షణం స్పందించి వ్యభిచారాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

మైపాడు బీచ్ అభివృద్ధికి రెండు కోట్లు!

రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తుందని సమాచార మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. 18తేది తోటపల్లిగూడూరు మండలం కోడూరు బీచ్ వద్ద పనకన్య రిసార్ట్స్ ప్రారంభోత్సవ సభలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో తమిళనాడు తర్వాత ఆంధ్ర

తొలవ 8వ పేజీలో

ప్రకటన

పూనూరు భక్తవత్సలరెడ్డి అను నేను మరియు నా తండ్రిగారైన శ్రీ పూనూరు చినరమణారెడ్డి గారు హిందూ అవిభక్త కుటుంబ సభ్యులము అయివున్నాము. క్రింద వివరించిన షెడ్యూలు ఆస్తి మా జాయింటు కుటుంబమునకు చెందియున్నది. నా తండ్రిగారైన పూనూరు చినరమణారెడ్డి క్రింద తెలిపిన ఆస్తిని తన స్వంత ఆస్తిగా మభ్యపరచి విక్రయించుటకు లేదా తనఖా చేయుటకు ప్రయత్నం చేయుచున్నారని తెలియుచున్నది. అట్లు ఎవరైనా విక్రయం లేదా తనఖా పొందినయెడల సదరు పత్రములు లేదా మరేదైనా సదరు ఆస్తి సంబంధ పత్రములు అప్పులు, ఆస్తిలో నా యొక్క వాటాను బద్దకించవు మరియు చెల్లనేరవు. ఎవరైనా ఇందుకు విరుద్ధముగా వ్యవహరించిన యెడల నేను తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

ఆస్తిషెడ్యూలు

నెల్లూరు జిల్లా, కోవూరు గ్రామములోని 4.54 3/4 ఎకరముల మాగాణి భూమి.

పట్టానెం.	సర్వేనెం.	అనుభవ విస్తీర్ణం	హద్దులు
304	737/B	2.49	తూర్పు: అగ్గిరమణయ్య, కొట్లూరు రామానుజమ్మ, ఈగ రామిశెట్టి లక్ష్మయ్య గార్ల భూములు.
	737/A	0.48 3/4	
	738/B	0.26	
	738/D	0.48	ద: ఇసనాక విజయమ్మ, బద్దల సురేఖ, పూనూరు ప్రసూన గార్ల పొలము, పొరుదల కాలువ కొంతమేర.
	748/C	0.78	
	748/D	0.05	పడమర: కోసన కోదండయ్య భూమి. ఉత్తరం: ఒంటేరు తిరుపాలురెడ్డి భూమి.

కోవూరు పంచాయతీ పరియాలోని 8/4-24 డోరు నెంబరుగల వీరపురెడ్డి నరసారెడ్డి తోటవీధిలోని 22 అంకణముల స్థలములోగల 14 అం॥ మిద్దె ఇల్లు. **తూర్పు:** ఎర్రా వెంకయ్య ఇంటిగోడ. **దక్షిణం:** పూనుగుంట రామకృష్ణారెడ్డి, వెంకురెడ్డి గార్ల ఇంటిగోడ. **పడమర:** పిచ్చుక రమణయ్య గారి ఇంటి స్థలము. **ఉత్తరం:** రాజవీధి.

సదరు ఇంటి దగ్గరలోని 2 అంకణముల పడ్లకొట్టు, 1½ అంకణముల సిమెంటు రేకుల వరండా సామ్లు. **తూర్పు:** పడమల చెంగయ్య ఇల్లు. **దక్షిణం:** పూనూరు నారాయణరెడ్డి పడ్లకొట్టు. **పడమర:** గజ్జం శ్రీనివాసులురెడ్డి ఇంటి స్థలం. **ఉత్తరం:** పృథ్వి సీతారామమ్మ ఇల్లు.

పూనూరు భక్తవత్సలరెడ్డి
A-337, 4th Line, శాంతినగర్, కోవూరు.

నెల్లూరు వచ్చిపోయిన ముఖ్యులు

వై. ఎస్. రాక

జిల్లాలో ముఖ్యమంత్రి చేసిన వాగ్దాన భంగాలను ప్రజలకు గుర్తు చేయను ప్రతిపక్ష నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 24, 25తేదిల్లో నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించ నున్నారు. 24తేది ఉదయం వెంకటగిరి వెళ్తారు. మధ్యాహ్నం రాపూరు, పొదల కూరుల్లో జరిగే రైతు సదస్సులలో పాల్గొంటారు. కండ్లేరు వెళ్లి తెలుగు గంగ ముంపు వాసులను పరామర్శిస్తారు. సాయంత్రం కృష్ణపట్నం వెళ్తారు. అనం తరం ముత్తుకూరులో జరిగే బహిరంగ సభలో పాల్గొని రాత్రికి నెల్లూరు ఆర్ అండ్‌బి అతిధి గృహంలో బస చేస్తారు.

25తేది ఉదయం విలేఖరులతో మాట్లాడి, అనంతరం కో ఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో జరిగే రొయ్యల రైతు, మహిళా సదస్సుల్లో పాల్గొంటారు. మధ్యాహ్నభోజనాంతరం అల్లూరు మండల సముద్రతీర గ్రామం కుర్రును సందర్శిస్తారు. అటుపిమ్మట ఇస్కపల్లిలో ఏర్పాటు చేసే పార్టి కార్యకర్తల సమావేశంలో పాల్గొని సాయంత్రం కావలి చేరుతారు.

చంద్రమోహన్‌రెడ్డి

సమాచారమంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఈ రోజు(20తేది)నెల్లూరు వచ్చి కలువాయి మండల పర్యటనకు బయలుదేరి వెళ్లారు.21తేది మంత్రి చిజెర్ల మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారం భోత్సవాల్లో పాల్గొని రాత్రికి రాజధాని బయలుదేరి వెళ్తారు.

మేకపాటి చేతికి కోవూరు షుగర్ ఫ్యాక్టరీ

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ఉదయగిరి రాజకీయ ప్రముఖుడు, మాజీ ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి చేతికి చిక్కింది. సహకార చక్కెర ఫ్యాక్టరీల ప్రైవేటీకరణకు ప్రభుత్వం జారీ చేసిన ప్రకటనకు స్పందించి రాజమోహన్‌రెడ్డి నేతృత్వంలోని కెఎంసి కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ 32.32కోట్లతో అత్యధిక బిడ్ దాఖలు చేసింది. ఫ్యాక్టరీ కోసం సుదల గుంటహోటల్స్ 32కోట్లు, ఎమ్పీ హోల్డింగ్స్28. 29కోట్లు, విజయ ఆగ్రో ప్రొడక్ట్స్ 28.50కోట్లు, క్రెబ్స్ బయో కెమ్16.2కోట్లకు బిడ్లను దాఖలు చేశాయి. అత్యధిక బిడ్ కెఎంసిదే కాబట్టి ఏ అవాంతరాలు ఎదురుకాకుంటే ఫ్యాక్టరీ వారి స్వంత మవుతుంది. ఆధునీకరించిన ఫ్యాక్టరీ, స్థిరాస్తులు, విలువైన స్థలం కలిపి 32కోట్లకు మాత్రమే పాట పలకడం బాధాకరం.

బస్టాండ్ మార్పుతో ఆర్టీసికి నష్టం

ఆత్మకూరు బస్టాండ్‌వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నందున ఇక్కడి బస్టాండ్‌ను తాత్కాలికంగా బర్మాషెల్ గుంట వద్ద ఎస్పీ రాజేంద్రనాధ్‌రెడ్డి సలహా మేరకు మార్చడంతో, ఆర్టీసి గత మూడు నెలల వ్యవధిలో పది లక్షలు నష్ట పోయింది. నిత్యం ఆత్మకూరు బస్టాండుకు వచ్చే వందలాది ఆర్టీసి బస్సుల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గుతుందని తాత్కాలిక మినీ బస్టాండ్ ప్రతిపాదనను ఎస్పీ తీసుకొచ్చారు. ఆర్టీసి అధికారులు త్వరగానే స్పందించి ఆత్మకూరు బస్టాండ్ నుంచి వెళ్లే 200కు పైగా గ్రామీణ సర్వీసులను బర్మాషెల్ గుంట నుంచి నడుపు తున్నారు. ఆర్టీసి బస్సులు బర్మాషెల్ గుంట వద్దనుంచే తిరిగి వెళ్లి పోవడంతో ప్రైవేటు సర్వీసులు ఆత్మ కూరు బస్టాండ్‌వరకు వెళ్లి ఆర్టీసి కలక్షన్లను కొల్లగొడుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు కరుగ్గా డ్యూటి చేస్తే ప్రైవేటు బస్సులు ఆత్మకూరు బస్టాండ్ వరకు రావు. ఆర్టీసి నష్టపోదు. ఈ విషయాన్ని ఆర్టీసి అధికారులు జిల్లాఎస్పీ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది.

పెద్దాసుపత్రిలో కిటికీల చోరీ

ప్రభుత్వ ఆస్తులంటే దొంగలకు సైతం చులకనై పోయింది. వాచ్‌మెన్లు, ఇతర పారా మెడికల్ సిబ్బంది విధులు నిర్వహిస్తుండగానే నెల్లూరు పెద్దాసుపత్రి లోని 40కిటికీలను దొంగలు తీరిగా



జక్కారంగారెడ్డి కళాపీఠం ఆధ్వర్యంలో జరిగిన పద్యనాటక పోటీల ముగింపు సభలో నెల్లూరులోని జక్కా సుజాతమ్మ క్యాన్సర్ నిర్ధారణ కేంద్రంలోని డాక్టర్ అరుణాచంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న జక్కా సోదరులు, వారి కుటుంబ సభ్యులు. ఫోటోలో తనికెళ్ల భరణి, పొన్నాల రామసుబ్బారెడ్డి కూడా వున్నారు.

ఊడబెరుక్కెళ్లారు. ఆసుపత్రి వంటగది పక్కనే అత్యాధునికంగా కడుతున్న అదనపు భవనానికి కూలింగ్ గ్లాసులున్న కొత్తమోడల్ కిటికీలు అమర్చారు. దొంగలు గ్లాసులు పగులగొట్టి కిటికీలు మాత్రం పట్టుకెళ్లారు. ఆలస్యంగా విషయం తెలుసుకొన్న ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేసి సరిపెట్టుకొన్నారు.

నెల్లూరులో నాన్‌స్టాప్ నవ్వులు

సింహపురి సంస్కృతి సమాఖ్య 29తేది సాయంత్రం టౌన్‌హాల్‌లో కళా రంగంలో నూతన వరవడిని సృష్టిస్తూ నాన్‌స్టాప్ నవ్వుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూంది. ఇప్పటికే లెక్క లేనన్ని హాస్యావధానాలు చేసిన హైదరా బాద్‌కు చెందిన శంకరనారాయణ ఈ సందర్భంగా హాస్యావధానం చేస్తారు. అనంతరం సినీ రచయిత, నెల్లూరీయుడు జలదంకి సుధాకర్ రచించిన 'థాంక్యూ సుబ్బలక్ష్మి 'నాటికను హైదరాబాద్ కళా కారులు ప్రదర్శిస్తారు. మనసంతానువ్వే సినిమా 'దర్శకుడు వివిఎన్ ఆదిత్య, సినీ రచయితలు మోహన్ భార్గవ, జలదంకి సుధాకర్, కృష్ణమూర్తి ముఖ్య అతిధులుగా విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగే సభకు ఇన్‌కమ్ టాక్స్ అడిషనల్ కమిషనర్ కె.శ్రీధర్ అధ్యక్షత వహిస్తారు. నెల్లూరీయులు ఈ కార్యక్రమానికి విచ్చేసి మనసారా నవ్వుకోమంటున్నాడు నిర్వాహకుడు, మెజీషియన్ రాంజీ.

పొణకా కనకమ్మ వర్ధంతి సభ

స్వాతంత్ర సమరయోధురాలు స్వర్గీయ పొణకా కనకమ్మ వర్ధంతి సభను 15తేది ఇందిరాభవన్ సెంటర్‌లో పిసిసి మాజీ అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు వురు కనకమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో నెల్లూరు పేరును దేశవ్యాప్తం గావించిన భరత మాత ముద్దుబిడ్డ, ఉద్యమ సమరదీపిక, కాంగ్రెస్ వుద్యమ విధాత, నిస్వార్థ సేవాప్రదాత కనకమ్మని చెప్పారు. ఆమె పొట్లపూడిలోని 12,722 ఎకరాల తన స్వంత ఆస్తి స్వాతంత్ర్య వుద్యమానికి అర్పించారు. ఎంతోమంది సమరయోధులు, కవులకు కనకమ్మగారి ఇల్లు కేంద్రమని, అల్లూరి సీతారామరాజు కూడా అజ్ఞాతంలో కనకమ్మ ఇంట్లో వున్నట్లు చెప్పారు. పొణకా కనకమ్మ త్యాగాలను రాష్ట్ర ప్రభు త్వం గుర్తిస్తూ కనకమ్మ జీవిత చరిత్రను విద్యాలయాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని, నెల్లూరులో ఆమెవిగ్రహాన్ని ప్రతిష్టించా లని శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు తాటి వెంకటేశ్వరరావు, మందా బాబి, భాజా మొహిద్దీన్, సుధా కర్, బత్తుల వెంకటేశ్వర్లు, వి. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహులు గౌడ్‌కు పదవి

నెల్లూరు జిల్లా బిసి సమాఖ్య అధ్య క్షుడు, 14ఏళ్లు మునిసిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవశాలి, జిల్లా బిసిల సంక్షేమం కోసం పలు ఉద్యమాలు చేపట్టిన ఉదయగిరి నరసింహులుగౌడ్ కాంగ్రెస్ పార్టి రాష్ట్ర బిసిసెల్ కార్యదర్శిగా నియమితులయ్యారు. గౌడ్‌చేసిన సేవలకు చాలా కాలానికైనా గుర్తింపు లభించి నట్లుంది.

కృష్ణసాయి సేవాసమితి ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు కోటమిట్టలోని కృష్ణసాయి సేవాసమితి 14తేది సిటిజన్ పబ్లిక్ స్కూల్‌లో, సామ్రాట్ క్లినిక్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించింది. తెలుగుదేశం పార్టి మైనార్టి సెల్ అధ్య క్షులు సయ్యద్ సమి శిబిరాన్ని ప్రారం భించి మాట్లాడారు. హుస్సేనీ ఎడ్యుకేష నల్ సొసైటి తరపున అర్హులైన పేదలకు15వేల రూపాయల మొత్తం వరకు అత్యవసర వైద్య సదుపాయ సహాయం అందించేందుకు సిద్ధంగా వున్నట్లు ప్రకటించారు. శిబిరంలో 700 మందిని పరీక్షించి మందులు పంచి పెట్టారు. డాక్టర్లు ఎం. సుధాకర్, ప్రభాకర్ పాత్రో, జి.కిరణ్, రవీంద్రబాబు, వెంక టేష్ పాల్గొన్నారు. శిబిరం దిగ్విజయ మయ్యేందుకు సమితి అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ శ్రమించారు.

డాక్టర్ వెంకటేష్ ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు గాంధి నగర్‌లోని కస్తూ రిబా ఆర్థోపెడిక్ అండ్ ఆక్సిడెంటోకేర్ హాస్పిటల్ నేతృత్వంలో 15తేది ఉచిత ఎముకలు, కీళ్లు, నరాలు, వెన్నెముక సంబంధిత వ్యాధుల వైద్యశిబిరం గూడూ రులో నిర్వహించారు. దీన్ని మునిసిపల్ ఛైర్మన్ కోడూరు కల్పలత ప్రారంభిం చారు. 450మంది రోగులను పరీక్షించి 50వేల రూపాయలకు పైగా విలువచేసే మందులు పంచిపెట్టారు. శిబిరంలో డాక్టర్లు ఆర్. వెంకటేష్, పి. భాస్కరరావు, ఫిజియోథెరపిస్ట్‌లు ఆర్. విజయ, కుమారి పావని పాల్గొన్నారు.

తరువాయి 7వ పేజీలో

జీప్ అమ్మబడును

93 మోడల్ మహేంద్ర (DI) జీప్ (MN540) 3 డోర్లు, ఫైబర్ బాడీ, మంచి కండీషన్‌లో వున్నది 2008 వరకు లైఫ్ టాక్స్ కట్టి వున్నది అమ్మబడును - నెల్లూరు.

వివరములకు సంప్రదించండి
ఫోన్స్: 306847 (House) 329613 (Shop)

హార్దికాభినందనలు



శ్రీ గవ్వా రవీంద్రరెడ్డి రాష్ట్ర అధ్యక్షులు | శ్రీ డి.యస్.సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రధానకార్యదర్శి | శ్రీ కె.దశయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు | శ్రీ యమ్.యమ్.మనోజ్‌కుమార్ జిల్లా అధ్యక్షులు | శ్రీ పి.అహ్మద్‌బాషా జిల్లా ప్రధాన కార్యదర్శి

మా మిత్రులు శ్రీగవ్వా రవీంద్రరెడ్డి గారు రాష్ట్ర అధ్యక్షులుగా
శ్రీ డి.యస్. సుబ్రహ్మణ్యం గారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా
శ్రీ కె.దశయ్య గారు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా
రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ వర్క్ ఇన్‌స్పెక్టర్స్ యూనియన్ ఎన్నికలలో ఎన్నికైన శుభ సందర్భంగా

హృదయ పూర్వక హార్దికాభినందనలు తెలుపుతూ....

శ్రీ కె.దశయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు కృషి చేసిన నెల్లూరు జిల్లా అధ్యక్షులు శ్రీ యస్.పి.యమ్. మనోజ్‌కుమార్ గారికి మరియు ప్రధాన కార్యదర్శి శ్రీ పి.అహ్మద్ బాషా గారికి
మా హృదయ పూర్వక హార్దిక శుభాకాంక్షలు

ఇట్లు
నెల్లూరు జిల్లా గృహ నిర్మాణ సంస్థ వర్క్ ఇన్స్‌పెక్టర్లు

పగుళ్లు

5వ పేజీ తొరవ

విద్య, వైద్యం సర్వం అందుబాటులో వుంచేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది వింజమూరులో ఒక డిగ్రీ కాలేజీ, వింజమూరు, మర్రిపాడు, దుత్తలూరులలో మూడు జూనియర్ కాలేజీలు మంజూరు చేయించానన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ అమలు ద్వారా ప్రతి గ్రామానికి త్రాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ఉదయగిరిని శాశ్వత కరవు ప్రాంతంగా ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదలకు ప్రయత్నిస్తానన్నారు.

రెండు వారాలుగా కరెంట్ లేదు

మనుబోలు మండలంలోని వీరంపల్లి గ్రామ పంచాయితీ మజరా 'లింగారెడ్డిపల్లి'గ్రామానికి గత రెండు వారాల క్రితం విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. మామూలుగా ఈ గ్రామానికి తిక్కవరప్పాడు సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా అవుతుంది. కాని6తేది నుండి మెయిన్ లైన్లలో అంతరాయం కల్గడంవల్ల రెండు వారాలుగా ఆ గ్రామం చీకటి మయం అయ్యింది. గ్రామంలోని వారు పెళ్ళూరు సబ్ స్టేషన్ వద్ద మొర పెట్టుకొన్నా లాభం లేక పోయింది. చివరకు మనుబోలు మండలంలోని విద్యుత్ ఆఫీసు చుట్టూ, అర్జీ పట్టుకొని తిరుగుతున్నా సమస్య మాత్రం తీరడం లేదు. గ్రామాల పట్ల విద్యుత్ శాఖాధికారులు ఇంత చిన్నచూపు చూడడంతగదు.

మనుబోలులో విఘ్ననాధుడికి పూజలు

మనుబోలు మండలంలోని పలు గ్రామాలలో వినాయక చవితి వేడుకలు ప్రజలు ఆనందంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. వినాయక చవితి సందర్భంగా అనేక చోట్ల విఘ్ననాధుడి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేశారు. మనుబోలు గ్రామంలో చవితి సందర్భంగా కోదండరామపురం వద్ద భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి మిరుమిట్లు గొలిపే, విద్యుత్ అలంకరణలతో పూజలు నిర్వహించారు. చవితి సందర్భంగా గ్రామంలో అనేకచోట్ల ఉట్టి కొట్టడం కనిపించింది. చవితి వేడుకలు మనుబోలు గ్రామంలోని కోదండ రామపురంలో ఐదు రోజులు పూజలు నిర్వహించినశనివారం నాడు గణేశుని విగ్రహం నిమజ్జనం చేశారు.

కోడూరుపాడు బెస్ట్ టీచర్

నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసే వి.రామచంద్ర నాయుడ్ని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేసింది. కేతిది హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అవార్డును రామచంద్ర నాయుడికి అందించారు.

భార్య పై భర్తదాడి

కొడలకూరు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన శారద అనే మహిళను ఆమెభర్త జిలాని శుక్రవారం దాడిచేసి గాయపరచినట్లు శనివారం పొదలకూరు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం శారదను ఆమె భర్త గతంలో చిత్ర హింసలు పెట్టడంతో భర్తనుంచి కొన్ని సంవత్సరాలుగా దూరంగా వుంటూ కులవృత్తి అయిన రజకవృత్తి చేసుకొంటూంది. శారదను అనుమానిస్తున్న జిలాని శుక్రవారం హఠాత్తుగా వచ్చి చాకలి పని చేయొద్దంటే చేస్తావా అని దాడిచేసి గాయ పరిచాడు. శారదకు తలపై బలమైన గాయం తగిలింది. కేసును పోలీసు విచారిస్తున్నారు.

తాగునీటి కోసం ఎదురుచూపులు

మనుబోలు మండలంలోని కొలనుకుదురు, కట్టువపల్లి గ్రామాలలోని ప్రజలు చుక్కనీటి కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొని వుంది. ఈ గ్రామాలలో తాగు నీటి సమస్య అనేక సంవత్సరాల నుండి వెంటాడుతుంది. ఇక్కడి గ్రామాలలో రొయ్యల గుంటలు ఎక్కువ అయినందు వల్ల మంచినీటి సమస్య తీవ్ర రూపం దాల్చుతూంది. 'పైలెట్ ప్రాజెక్టును' ఇంకా అమలు పరచక పోవడం పట్ల ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాకిరేవు చేశారు

2వ పేజీ కొరవ

ఆ నిధులు ఎక్కడకు వచ్చాయో, ఎప్పుడు ఖర్చు పెట్టారో చెప్పండి, ఎన్ని పనులు చేశారో, ఎక్కడెక్కడ చేశారో చెప్పండి అని మంత్రిని నిలదీశారు. ఆమె ప్రశ్నలకు ఇటు మంత్రి నుంచి గాని, అటు కలెక్టర్ నుంచి గాని జవాబే లేదు. నిజాలు చెప్పమని అడిగితే చెప్పేదానికి వారు ఏమైనా పిచ్చివారా?

కాంగ్రెస్ జిప సభ్యులు రవికుమార్ యాదవ్, మాలకొండయ్య, చెన్నమ్మ, షబ్బీర్ తదితరులు కరవు సహాయంగా ప్రభుత్వం ఏ పని చేయడం లేదని నిరసన తెలుపుతూ వేదిక ముందు బైఠాయించారు.

జిప సమావేశం మూడు గంటల పాటు జరిగింది. జరిగినంత సేపు వినోదమే. ఛైర్మన్ నోట్లో నాలుక లేనివాడు కావడంతో మంత్రి వేదిక మీద కూర్చొని తానే జిప ఛైర్మన్ అన్నట్లు సమావేశం నిర్వహించడం అలవాటు చేసుకొంటున్నాడు. ఈ సమావేశంలోనూ ఛైర్మన్ నిమిత్తమాత్రుడు. ఆయన, కలెక్టర్ కలిసి జరుగుతున్న తమాషా చూస్తూ కాలం గడిపేశారు.

విలవిల

మొదటి పేజీ కొరవ

లేదు; వేసిన శంఖుస్థాపన రాళ్లను చూపడం, చేసిన వాగ్దానాలను జ్ఞాపకం చేయడం మాత్రమే చేస్తున్నారాయన.

ఈ వెటకారాన్ని ఏ రీతిలో తిప్పి కొట్టగలరు ఎవరు మాత్రం? దీనికి పరిష్కారం ఒక్కటే ఒక్కటి - ఆయా వాగ్దానాలను అమలు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువరించాలి; శంఖుస్థాపన చేసిన ఆయా పథకాలకు నిధులు విడుదల చేసి పనులు మొదలు పెట్టాలి. ఇది అలివయ్యే పని కాదు. అన్ని వేల వాగ్దానాలు, అన్ని వందల శంఖుస్థాపనలు అమలు చెయ్యాలంటే ప్రభుత్వ బడ్జెట్ చాలదు. అందువల్ల కుక్కిన పేను పలె - తేలు కుట్టిన దొంగ పలె వుండిపోవడం తప్ప చంద్రబాబు చెయ్యగల్గింది ఏదీ కనపడడం లేదు. రాజశేఖరరెడ్డి ఉద్యమం పట్ల విపరీతమైన జనస్పందన కన్పిస్తున్నది. ఈ సభలకు వేలం వెర్రిగా వస్తున్నారు ప్రజలు. దానితో ఉపన్యాసకుల మాటల వేగానికి అదుపు వుండడం లేదు.

గత కొంత కాలంగా పనికి ఆహార పథకం బియ్యం దుర్వినియోగం తెలుగు దేశం పార్టిని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నది. గ్రామ స్థాయి నుంచి మంత్రుల వరకు తెలుగు నేతలు అందినంత బియ్యం బొక్కారన్న నిజం జనానికి స్పష్టంగా తెలుసు. పత్రికలలో వార్తలు, ప్రతిపక్షాల కేకల రూపంలోనే కాదు, తమ కళ్ల ముందు తిరిగే తెలుగుదేశం కార్యకర్తలు ఒకే ఒక్క ఏడాదిలో ఎంతటి సంపన్నులైందీ జనం ప్రత్యక్షంగా చూస్తున్నారు. సైకిల్‌కు కూడా గతిలేని వారు మారుతీ కార్లు కొని తిరగడం గమనిస్తూనే వున్నారు. ఇంతటి అవినీతి జరుగుతున్నా ప్రభుత్వ పరంగా కనీసపాటి చర్య కూడా లేక పోవడం జనం దృష్టిలో పడుతూనే వుంది. ఈ పరిణామాలన్నీ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టను దిగజార్చి వేస్తున్నాయి. దీనికి ఇప్పటి రాజశేఖరరెడ్డి ఉద్యమం నిప్పుకు గాలి వలే తోడ్పడుతున్నది.

వీటన్నింటితో రాష్ట్ర రాజకీయ వాతావరణం వేడెక్కి పోతున్నది. ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర గడువు వున్నప్పటికీ అప్పుడే ఎన్నికల వాతావరణం ఏర్పడి పోతున్నది. ఈ రాజకీయ సెగలు, పొగల వల్ల ప్రభుత్వం మీద వత్తిడి పెరిగిపోతున్నది. ముఖ్యమంత్రి తడబడి పోతున్నాడు.

చిరంజీవి

మొదటి పేజీ కొరవ

ఈ నేపథ్యంలో చిరంజీవి చేత రాజకీయ రంగ ప్రవేశం చేయించాలన్న ప్రయత్నం మొదలయ్యింది. ఇందులో ఇటు కాంగ్రెస్‌వాదులు, అటు తెలుగు దేశం వారు కూడా చేతులు కలపడం విశేషం. చిరంజీవి రాజకీయాలలోకి వస్తే రాష్ట్రంలోని కాపు కులస్తులు ఆయన వెనుక సమీకరింపబడతారన్నది వీరి అంచనా. ఓటర్లలో హరిజన, గిరిజన తర్వాత కాపు కులస్తుల సంఖ్య ఎక్కువ. దాదాపు 10శాతం ఓటర్లు కాపు కులస్తులే! ఇంత పెద్ద సంఖ్యలో ఒక వర్గం ప్రజలు ఒక రాజకీయ పార్టీ పట్ల ఆకర్షితులైతే దాని ప్రభావం ఎన్నికల ఫలితాలను శాసించే రీతిలో వుంటుందన్నది వీరి ఆశ. మరొక ప్రక్క చిరంజీవికి కుల ప్రస్తావన లేకుండా కొన్ని లక్షల మంది అభిమానులు వున్నారు. వీరిలో అధికులు యువకులు. ఆయనకు వూరూరా అభిమాన సంఘాలు వున్నాయి. ఎన్నికల సమయంలో వాటిని ఉపయోగ పెట్టుకొంటే తెలుగుదేశం, కాంగ్రెస్‌లతో సమానంగా ఎన్నికల యంత్రాంగం కల్గిన పార్టీగా గుర్తింపు పొందుతుంది.

ఇప్పటి వరకు తెలుగుదేశం కమ్మ



కితకితలు వచన కవిత సంకలనం ఆవిష్కరణ సభలో డాక్టర్ నిమ్మెరెడ్డి జయప్రద, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ సురేంద్ర బాబు, కవులు మోనా, గొరాబత్తిన నీలకంఠం, పెరుగు రామకృష్ణ

కులస్తుల ప్రాముఖ్యత కల్గిన పార్టీగా, కాంగ్రెస్ రెడ్డి కులస్తుల పెత్తనం కల్గినదిగా ప్రచారంలో వున్నాయి. ఆ రెండు కులాలతో సమానంగా సంఖ్యా బలం, ఆర్థిక స్థోమత, రాజకీయ చైతన్యం కల్గిన తమకు వీటిలో తగిన విలువ, గౌరవాలు లభించడం లేదని కాపు కులస్తుల ఆవేదన. కాపు కులస్తుల జనాభా కోస్తా ఆంధ్రలో ఎక్కువ. ఈ ప్రాంతంలో ఈ కులం అగ్రవర్ణంగా చలామణిలో వుంది. అందువల్ల ఏ పదవి వచ్చినా అగ్రవర్ణాలైతే కమ్మ, రెడ్డి కులస్తులు తన్నుకపోతున్నారు; వెనుకబడిన తరగతులకు అవకాశం ఇవ్వదలిస్తే యాదవ, గౌడ కులస్తులు ముందు నిలుస్తున్నారు. తాము మాత్రం రెంటికీ చెడిన రేవడుల వలె మిగిలి పోతున్నామన్న అసంతృప్తి కాపులలో చాలా కాలం నుంచి వుంది. 1994 ఎన్నికల సమయంలో కాపు కుల గౌరవం పేరిట పెద్ద ఎత్తున ఉద్యమం జరిపిన ముద్రగడ పద్మనాభం వంటి వారు తమకు పదవులు రాగానే ఉద్యమాలను ప్రక్కన పెట్టి ఆయా పార్టీలతో సర్దుక పోయారు. ఈ నేపథ్యంలో చిరంజీవిని రాజకీయాలలోకి తీసుకరాగల్గితే తమ కులానికి సముచిత గౌరవం, ఆదరణ లభించడంతోపాటు రేపు ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేసే ఆశ వీరిలో మిణుకు మిణుకుమంటున్నది. అందుకోసం కాపు పెద్దలందరూ కలిసి చిరంజీవి మీద విపరీతమైన వత్తిడి తెస్తున్నారు.

రెండు నెలల క్రితం కుప్పంలో జరిగిన ఇంద్రసినిమా షూటింగ్ సందర్భంగా చిరంజీవి పత్రికల వారితో మాట్లాడుతూ రాజకీయ ప్రవేశం పట్ల తన ఆసక్తిని వెల్లడించాడు. ఆయనలో ఆ కోరిక వుంటే మాత్రం రాజకీయ ఆరంగ్రేటానికి ఇంతకంటే మించిన తరుణం మరెప్పుడూ రాదు. రాష్ట్రంలో ఓటర్లు తెలుగుదేశం ప్రభుత్వం పట్ల విరక్తి చెందుతున్నారు. చంద్రబాబు మాటల పోగే తప్ప చేసేది శూన్యమన్న అభిప్రాయం బలపడి పోతున్నది. కాంగ్రెస్ పట్ల మన ఓటర్లలో ఎప్పుడో విసుగు జనించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల్గిన సామర్థ్యం కల్గిన మూడవ పార్టీ ఏదైనా రంగంలోకి వస్తే జనం దానిపట్ల ఆకర్షితులయ్యే అవకాశాలు ఎక్కువ. అయితే దానికి కులం రంగు పులమడం, ఒక వర్గానికి ప్రతినిధులుగా గుర్తింపు పొందడం మాత్రం ఆత్మహత్యా సదృశ్యమౌతుంది.

చిరంజీవికి రాజకీయ కోరిక వుంటే తమ పార్టీలో ఆయనకు తగిన స్థానం కల్పించడానికి కాంగ్రెస్ సిద్ధంగా వుందని ఒక వార్త. సోనియాగాంధీ స్థాయిలో కూడా ఈ ప్రస్తావన వచ్చిందని వినికిడి.

నెల్లూరు ముచ్చట్లు

6వ పేజీ కొరవ

వర్షం

ఆకాశం నుంచి వర్షపు చినుకు రాలక చింతాక్రాంతులైన జిల్లా ప్రజలకు ఉపశమనం కల్గిస్తూ మంగళవారం నుంచి ప్రతిరోజూ సాయంత్రం ఓ వర్షపు జల్లు పరామర్శించి వెళ్తూంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడం వల్ల వర్షాలుపడే అవకాశాలను కొట్టిపారేయలేమంటున్నారు వాతావరణ శాఖాధికారులు. మంచి వర్షం పడితే జిల్లాలో వ్యవసాయపనులు ప్రారంభమవుతాయి. దేవుడు కరుణిస్తే బాగుంటుంది.

కోవూరు సీనియర్ సివిల్‌జడ్జివారి కోర్టులో
EP19/2000
OS 202/91

యన్నా చంద్రశేఖర్‌రెడ్డి- D.Hr
Vs
మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి- J.Dr
ఆర్డర్21, రూల్ 66 నోటీసు
To
మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి,
S/o.జాలరెడ్డి, ఉప్పలపాడు గ్రామం,
దగదర్తి మండలం. నెల్లూరు జిల్లా

ఈ నెంబరున E.Pలో D.Hr వేలం నిమిత్తం పిటీషను దాఖలు చేసినందున, యిందు విషయమై నీకు నోటీసు నిమిత్తం తే23.9.02దినకు వాయిదా వేసియున్నారు ఆరోజు ఉదయం 10.20గంలకు పై కోర్టు వారి ఎదుట హాజరై నీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని ఎడల నీ పరోక్షమున వ్యాజ్యము తీర్పునము చేయుదురు

C.సురేంద్రరెడ్డి
D.Hr తరపు అడ్వకేటు, కోవూరు



స్మృత్యంజలి

కీ॥శే॥ ఎం.జి.సుందరరావు గారు

భౌతికంగా మమ్మువీడి 2 సంవత్సరాలైనను ఎన్నటికి మరువలేని మీ దివ్యస్మృతులతో నా మదిలో ఎల్లవేళలా నిలిచియున్నారు. మీ పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్న

జననం:1.7.1944 మరణం:28.9.2000
M.G.సుందరరావు
(MAN) B.A., B.L.,
స్పెషల్ అసిస్టెంట్, SBI
ఫతేఖానపేట, నెల్లూరు

మీ భార్య: సరోజ

వినాయకుడి రహస్యం విప్పిచెప్పరూ?

* కాస్త్రాల్లో వినాయకుడి గురించి రహస్యం తుందుంబురు డ్వాకర్ మొహానిన్ పట్వారి 'ద వినాయక ఆఫ్ హిజ్ సీక్రెట్ కీల్స్' అనే గ్రంధంలో - దయచేసి విప్పి చెప్పరూ?

డా. కె.సత్యనారాయణశాస్త్రి చెన్నై

వినాయకుడి తండ్రి శివుడి ఆయుధం త్రిశూలం. నాగలికి చిహ్నం. గంగ శిరస్సున ధరించడం సుభిక్షతకు కేతనం. మహిషం వాహనుడు కావడం పశుగణాలపై ఆధిపత్యం వహించడం వెరసి వ్యవసాయాధి దేవతగా పూజలందుకున్నాడు. వినాయకుడూ అంటే పంటల దేవుడు! రైతుకు శత్రువైన 'ఎలుక'ను శాసించి వాహనం చేసుకొన్నాడు. వీళ్లి ధర్నీ ఆర్యులు పంటల దేవతలుగా పూజించారు - వేదాల్లో, డా. మొహసిన్ చెప్పిన రహస్యం గానీ ఇదే!

* జమీన్‌రైతు సమాధానాలు చూసి చాలా మంది తమ ఇళ్లను సరి చేసుకుంటున్నారు. ఫలితం తుంటుందంటారా?

పీలకా రామనాధశర్మ గుంటూరు

స్వంత వైద్యం ప్రమాదం సుమా?

* మీరిచ్చిన ఒక సలహా పాటించాము (ఇతరుల కిచ్చినది) ఫలితం కనిపించడం లేదు!

నుగుణా రామప్రసాదు ఒంగోలు

ఒకరికిచ్చిన సలహా మొక్కల్లా సరిపోతుంది? మీ సమస్యేమిటో చెప్పండి?

* 'హంపీ'లో పద్మమహల్ దగ్గర వున్న 'బావి' వాస్తు ప్రకారం అక్కడ వుంటవచ్చా?!

ఎ.ప్రభాకర శాస్త్రి తిరుపతి

వాస్తు ప్రకారం ఆ 'బావి' అక్కడ వుండటం తప్పే!

* వాస్తు ఇంట్లో సక్రమంగా వుండాలంటే మిమ్మల్ని ఏ ఏ స్థితుల్లో తీసుకవచ్చి చూపించాలి?

నీతాప్రమోదినీదేవి బెంగుళూరు

పునాది - ద్వారాల అమరిక - లింటల్ దశ - స్లాబు ఈ స్థితులు చూపించాలి.

* ఇంటికి ఏదిక్కులో 'గుడి' గోపురాలు ఉండకూడదు?!

వి.కాత్యాయని కర్నూలు

ఇంటికి - తూర్పు, పశ్చిమాల్లో అన్నది శాస్త్ర నియమం.

* ప్లాను చూపించి మేం ఇల్లు కట్టుకోవచ్చా?!

కె. ఉమ తడ

ప్లాను 'డిస్కస్' చేసేటప్పుడు పాయింటు కుణ్ణంగా రాసుకొని ఆ తర్వాత వాలుగు పర్యాయాలు (దశలు) చూపించి మీరు ఇల్లు కట్టుకోవచ్చు.

* 'వాస్తు దోషాలుంటే ఏమౌతుంది?

సూర్యప్రకాశరావు రాయచోటి

కొన్ని యిల్లు కట్టుబడిలో ఆగిపోయి - శిధిలమై భూత ప్రేత పిశాచాలకు నిలయమవుతాయి. కొన్ని కట్టిన తర్వాత యజమాని పతనంతో శిధిలమవుతాయి. వాస్తు దోషాలు అంతటి ప్రభావాన్ని చూపిస్తాయి!

వాస్తు సందేహాలు-సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
ఫోన్: 338159

వాస్తు సందేహాలకు పాయసం సుబ్రహ్మణ్య మహర్షి పత్రికాముఖంగా సమాధానాలిస్తారు. ప్రశ్నలు పంపవలసిన చిరునామా -

ఆచార్య సుబ్రహ్మణ్యమహర్షి,
c/o జమీన్‌రైతు,
పొగతోట సెంటర్, నెల్లూరు - 1



నెల్లూరు కావుబీధి వినాయకుడ్ని పెన్నానదికి నిమజ్జనానికి తరలించే సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ అయిన ఎమ్మెల్యే వివేకా



నెల్లూరులో గణేష్ నిమజ్జనానికి చక్కని ఏర్పాట్లు చేసిన ఎస్పీ రాజేంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న గణేష్ నిమజ్జన కమిటీ సభ్యులు

జిల్లావార్తలు

5పేజీ తొరవ

ప్రదేశ్ పర్యాటక రంగం ద్వితీయ స్థానంలో వుందన్నారు. మన రాష్ట్రంలో ఇప్పటి వరకు 114 స్టార్‌హోటళ్లకు అనుమతివ్వడం వల్ల వీటిలో 7,333 రూములు నిర్మించారు. జిల్లాలో 14 లక్షల రూపాయలు వ్యయపర్చి నేలపట్టు వద్ద పర్యాటక విశ్రాంతి గృహాన్ని నిర్మించారని, దొరవారిసత్రం, తడల వద్ద పర్యాటక మోటెల్స్ పనులు పురోగతిలో వున్నాయని, నెల్లూరు చెరువులో ఏర్పాటు చేసిన బోటు షికారు వల్ల సెలవు రోజుల్లో 15వేలు, ఇతర రోజుల్లో ఐదు వేలు వస్తున్నాయన్నారు. మైపాడు బీచ్ అభివృద్ధికి కోటి 75లక్షల రూపాయలు ఖర్చు పెడతామన్నారు. వనకన్య రిసార్ట్స్ ఎండీ శౌరి, ఆర్డీఓ సుదర్శన్‌రెడ్డి, రూరల్ డిఎస్పీ వివేకానందస్వామి, మండలాధ్యక్షుడు బొమ్మి సురేంద్ర ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లాఠీలతో ఉద్యమాలు ఆపలేరు

పోలీసు లాఠీలతో తూటాలతో రైతుల ఉద్యమాన్ని ఆపలేరని జిల్లా పరిషత్ వైస్ ఛేర్మన్ చిట్టమూరు పద్మనాభరెడ్డి చెప్పారు. శనివారం మనుబోలు జాతీయ రహదారిపై జరిగిన రాస్తారోకోలో ఆయన మాట్లాడుతూ 24గంటలు కరెంటు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. కానిమండలంలో ఏడు గంటలే కరెంటు ఇస్తున్నారు. అది ఎప్పుడు ఉంటుందో పోతుందో తెలియదు, రైతులకు విత్తనాలు ఇప్పిస్తానని ముఖ్యమంత్రి వాగ్దానం చేసి మోచేయి చూపించాడని విమర్శించారు. డిసిసి కార్యదర్శి సాయి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం చంద్రబాబు రైతులకు అరచేతిలో వైకుంఠం చూపుతూ, జుట్టుకు తప్ప అన్నిటికి పన్ను వసూలు చేస్తున్నారు. ఈ నెల రెండో తేది నెల్లూరులో అక్వా రైతులపై పోలీసులచేత అమానుషంగా లాఠీ ఛార్జి చేయించిన చంద్రబాబు, ఆనాటి బ్రిటిష్ దొరల కంటే కర్కసుడన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడు ఎమ్ విజయ భాస్కర్ తదితరులు రాస్తారోకోలో పాల్గొన్న రైతుల నుద్దేశించి మాట్లాడారు.

ఉపాధ్యాయులు ఆదర్శంగా మెలగాలి

అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు ఉపాధ్యాయుడు ఆదర్శంగా నిలవాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం చెప్పారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన ఒక కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఈర్ష్యా, అసూయలకు దూరంగా ఉన్నప్పుడే తన వృత్తికి న్యాయం చేయగలుగుతాడు. పనిచేసేచోట టీచర్లు నివాసం ఉండాలనే నిబంధనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలకు విద్యాశాఖలో ప్రత్యేకంగా ఒక గుమస్తాను కేటాయించాలని కోరాడు. ప్రస్తుతం గుమస్తాలు లేకపోవడంతో టీచర్లు పంపించాల్సిన 'రికవరీలు'సకాలంలో చేరడం లేదన్నారు. అంత క్రితం ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం దగదర్తిశాఖ నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సాయిప్రసాద్, భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి సంఘటనా కార్యదర్శులుగా జనార్దన రావు, మహేంద్ర కృష్ణలను ఎన్నుకొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నేతలు నరసింహారెడ్డి, సుధాకర్, శ్రీనివాసులు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో సాహిత్య పంచమి

గూడూరులోని సంస్కృతీ సమ్మేళం సంస్థ సాహిత్య పంచమి కార్యక్రమాన్ని 13తేది నుంచి 17తేది వరకు డిఆర్‌డబ్ల్యు కాలేజీలో నిర్వహించింది. 13తేది రేపల్లె శ్రీవిద్య జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ మొవ్వ వృషాధ్రిపతి, మనుచరిత్ర - ధ్వని అనే అంశంపై, 14తేది గుంటూరు సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ మైలవరపు శ్రీనివాసరావు, నన్నయ్య - ప్రసన్న కథపై మాట్లాడారు. 15తేది బూసురుపల్లి వెంకటేశ్వర్లు త్యాగరాజ కృతులు - భక్తితత్వం గూర్చి, 16తేది జయంపు కృష్ణ, ఆధునిక కవిత్వం - శ్రీశ్రీ అనే అంశంపై, 17తేది కె.మహర్షణి, కవికోకిల దువ్వూరు రామిరెడ్డి అనువాద సాహిత్యంపై మాట్లాడారు. సభలు విజయవంతం చేసేందుకు సంస్కృతీ సమ్మేళనం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వై.జె.ప్రభాకర్‌రెడ్డి, కె.వెంకట సుబ్బారెడ్డి శ్రమించారు.

ఆదూరుపల్లిలో వేట మాంసం కారుచౌక

చేజర్ల మండలం, దాచూరు ఫారెస్టు రేంజి పరిధిలోని ఆదూరుపల్లిలో ఫారెస్టు అధికారుల సాక్షిగా వేటమాంసం కారుచౌకగా అమ్ముతుండడంతో, జనం ఎగబడి క్యూలో నిల్చుని తింటున్నారు. పట్టణ ప్రాంతాలలో వందరూపాయలు వెచ్చించినా దొరకని కుందేలు, దుప్పి, అప్పుడప్పుడు జింక మాంసం ఇక్కడ ప్లేటు 12రూపాయలకే కారుచౌకగా దొరుకుతుంది. మధ్యాహ్నం12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జనంతోపాటు ఈ మార్గంలో వెళ్లే నెల్లూరు, గూడూరు, రాపూరు, ఆత్మకూరు డిపోలకు చెందిన బస్సుల్లోని ప్రయాణికులు సైతం మాంసం కోసం ఇక్కడ క్యూ కడుతున్నారు. పట్టుమని 300 మంది జనాభాకూడా లేని ఈ కుగ్రామం వేట మాంసం పుణ్యమా... అంటూ భోజనం తింటే ఆదూరుపల్లి వెళ్లి తినాలన్నంతగా ఈ మధ్య జిల్లా వ్యాప్తంగా వాసికెక్కింది. ఇక్కడి ఫారెస్టు ఠాణాకు అతి సమీపంలో ఉన్న రెండు హోటళ్లలో విచ్చలవిడిగా వేటమాంసం అమ్ముతుండడం చూస్తే ఇందులో ఫారెస్ట్ అధికారులకు కూడా వాటా వున్నట్లు అనుమానం కల్గుతుంది. అటవీ సంపదను పరిరక్షించాల్సిన అధికారులే వన్యప్రాణులను ఆరగిస్తుంటే, నోరులేని జీవుల ప్రాణాలకు ఎవరు రక్షణ కల్పిస్తారు? దాచూరు ఫారెస్ట్ రేంజి అధికారికి ఈ వేటమాంసం లేనిదే ముద్దదిగదట. 'కంచే చేను మేస్తున్న' విషయం డిఎఫ్‌ఓ వెంకయ్యగారికి తెలియజెప్పాలనుకొంటే పాపం ఆ వన్యప్రాణులకు మాటలు రావుగా?

పనికి ఆహారం

5వ పేజీ తొరవ

చివరికి మీకు మిగిలేది కాసులు కాదు.. కేసులు అంటూ ఈ దళారి తనదైన శైలిలో కాంట్రాక్టర్లను భయపెట్టి తన బుట్టలో వేసుకొంటాడు. ఇలాంటి రిస్కులేమి లేకుండానే బియ్యంకి బదులుగా డబ్బు నేరుగా చేతికి అందుతుందని చెప్పి సదరు పనుల కాంట్రాక్టర్లను, డీలర్లను నేరుగా రాపూరు స్టాక్ పాయింట్ వద్దకు రప్పించుకొంటాడు. డీలర్లకు బియ్యం ముట్టినట్లు అక్కడే రశీదుపై డీలర్లచేత సంతకం చేయించుకొని కాంట్రాక్టర్లకు డబ్బు చెల్లిస్తాడు. ఈ తతంగం అంతా రాపూరు స్టాక్ పాయింట్ అధికారి సమక్షంలోనే జరుగుతుంది. అవినీతి అధికారుల అంతదండలతో ఈ దళారి నెల్లూరు కేంద్రంలో ఎఫ్‌సిఐ నుంచి గ్రామాలకు చేరవలసిన బియ్యాన్ని స్టాకు పాయింట్‌లోనే వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి అధికార పార్టి అండదండలుండటం వల్ల ఏ ఒక్కరూ పట్టించుకోవటంలేదు.

సరికొత్త అందాలతో ఊర్మిళ

రంగీలా, సత్య చిత్రాల ద్వారా హీరోయిన్ ఊర్మిళకు హిందీ చిత్ర పరిశ్రమలో భవిష్యత్తును చూపిన దర్శకుడు రాంగోపాల్‌వర్మ. ఇటీవల కాలంలో రామ్‌గోపాల్ వర్మ తనవైపు కన్నెత్తి చూడకపోయేసరికి ఊర్మిళ మనస్సు భగ్గుమంది. కంపెనీ చిత్రంలో మనీషా.

హైదరాబాద్ సినిమా వార్తలు

తాజా చిత్రం రోడ్‌లో ఆంత్రామాలికి అవకాశం ఇవ్వడంతో తనలో తాను బాధపడి పోతూంది. వర్మను ఆకర్షించాలని కాబోలు జుట్టు కత్తిరించుకొని సరికొత్త అందాలతో ఈ మధ్య బాలీవుడ్‌లో జరిగిన పలు ఫంక్షన్స్‌కు హాజరయ్యింది. మొత్తానికి గమ్మత్తయిన హెయిర్‌కట్‌తో ఊర్మిళ బాగానే వుందం టున్నారు జనాలు. ఈ మాట వర్మ చెవిలో పడాలికదా?

వుక్కిరి బిక్కిరి చేసే ఉత్తరాలు

ప్రేమంటే ఇదేరా చిత్రంలో హీరోయిన్, సొట్ట బుగ్గలసుందరి ప్రీతి జింటా హిందీలో నటించిన దిల్ చాహ్‌తాహై చిత్రం హిట్టయ్యింది. దీంతో ప్రతిదినం అభిమానుల నుంచి ఆమెకు లెక్కకు మించి ఉత్తరాలు వస్తుండడంతో ప్రీతి, వుక్కిరి బిక్కిరి అవుతోంది. ఒక అభిమాని నేను నటించిన సినిమా పేర్లతో పెద్ద వుత్తరం రాశాడు. నీవు నా మనసుకు 'చోరీచోరీ చుప్కే చుప్కే' కాని నీవు నా ఎదుటపడితే క్యాకెహెచ్‌నా అంటూ నేను నటించిన అన్ని సినిమా టైటిల్స్ వచ్చేలా వ్రాశాడు. ఈ ఉత్తరాలు నాకు ఉత్తేజానిచ్చే టానిక్‌లా పని చేస్తుంటాయి. నా అభిమానులలో 40ఏళ్లు దాటిన వారూ వున్నారంటుంది ప్రీతి.



హీరోకోసం రిచా ఎదురుచూపు

ఎవరితోనూ ప్రేమలో పడలేదు

ఆది చిత్రం సూపర్ హిట్టయినా, ఈ చిత్రంలో హీరోయిన్ కీర్తిచావ్లా వెనువెంటనే 'ఏక్ పరదేశ్' హిందీ చిత్రాన్ని ఒప్పుకోవడం వల్ల ఆమెకు కొన్నాళ్లు తెలుగు చిత్రాలు చేతిలో లేకుండా పోయాయి. ప్రస్తుతం నేనంటే ఇష్టమేనా చిత్రంలో రోహిత్ సరసన నటిస్తున్న

కీర్తి చావ్లా

కీర్తిచావ్లా షూటింగ్ గ్యాప్‌లో మాట్లాడుతూ ఆది చిత్రం నాకెంతో పేరు తెచ్చి పెట్టింది. హిందీ చిత్రంలో నటించడం వల్ల తెలుగులో మూడు నెలల గ్యాప్ వచ్చింది. గ్లామర్ తోపాటు పెర్ఫార్మన్స్ పాత్రలు ధరించాలన్నది నా ధ్యేయం. ఆర్టిస్టుగా పది కాలాల పాటు మనజాలాలంటే ఎవరైనా సరే పెర్ఫార్మన్స్ పాత్రలు వేయాల్సిందే. తెలుగు, హిందీ చిత్రాల్లో పేరు తెచ్చుకోవాలన్నది నాకోరిక. అయితే మొదటి ప్రాధాన్యం తెలుగు చిత్రాలకే ఇస్తాను. తమిళ, కన్నడ చిత్రాల్లో నటించమని అడుగుతున్నారు. ప్రేమ విశ్వజనీనమైంది. నేను మెత్తటి అమ్మాయిని. నేను ఎవరితోను ప్రేమలో పడలేదు. నేను సంస్కృతీ, సాంప్రదాయాలకు ఎక్కువ విలువనిస్తాను. నా దృష్టంతా ఇప్పుడు కెరీర్‌పైనే ఉందంది కీర్తి.

గ్లామర్ పాత్రలు పోషిస్తే తప్పా?

నాలోవున్న ప్రేమ, స్టూడెంట్ నెం.1, ఓ చినదాన, కలుసుకోవాలని, అదృష్టం, అల్లరి రాముడు చిత్రాల్లో గ్లామర్ గర్ల్‌గా కనిపించిన గజాలకు అన్నీ గ్లామర్ పాత్రలే వస్తున్నాయి. ఈ విషయాన్నే ఆమెను అడిగితే అవును... టీనేజ్ గ్లామర్ గర్ల్ పాత్రల్నే ఎక్కువగా పోషిస్తున్నాను. నా వయస్సును బట్టి అటువంటివే వస్తున్నందు వల్ల వాటిలోనే కనిపిస్తున్నాను. అల్లరి రాముడులో ఛేంజ్ కోసం విలేజ్ గర్ల్‌గా నటించాను. కేవలం మాడరన్ దుస్తుల్లో కనిపించే గ్లామర్ పాత్రలే కాకుండా అభినయం కలగలిసి సీరియస్‌గా సాగే పాత్రల్ని అయినా పోషిస్తాను. కాని అవకాశాలు రావడం లేదు. థియేటర్ నుంచి బయటకు వచ్చిన ప్రేక్షకులు నా గూర్చి 'బాగా నటించిందిరా' అని చెప్పుకొనే నటిగా పేరు తెచ్చుకోవాలనుంది. అసభ్యకరంగా కనిపించే ఎక్స్‌పోజింగ్ పాత్రలు చేయను. కథావస రాన్ని బట్టి గ్లామర్‌గా కనిపిస్తే తప్పబడితే ఎలా అని వాపోయింది గజాల.

గజాలా గడుసుతనం

హీరోయిన్లలో ఆత్మవిశ్వాసం వుండాలి

ఆనందం, జాబిలి, ప్రస్తుతం ఒకటో నెంబరు కుర్రాడు చిత్రంలో నటిస్తున్న హీరోయిన్ రేఖ సినిమాల్లో నటించే హీరోయిన్లకు ధైర్యం, ఆత్మవిశ్వాసం వుండాలంటుంది. రేఖ తాను నటించే సినిమా షూటింగులకు ఒంటరిగా వస్తుంది. ఈ విషయమై ఆమె నడిగితే ఆఫీసుకువెళ్లే మహిళల వెంటతోడుగా ఎవరైనా వుంటారా? ఇది కూడా అంతే. నటించడం అనేది మా వృత్తి. షూటింగుకు వెళ్లడమంటే ఆఫీసుకు వెళ్తున్నట్లే. అలాంటప్పుడు మాకు మాత్రం తోడుఎందుకు? నామీద నాకు, అమ్మా, నాన్నలకు నమ్మకం వుంది. కాబట్టే ఎవరూ రావడం లేదు. అయినా సినిమా షూటింగుల్లో ఎంతో మంది మనుషులుండగా, అమ్మా నాన్నలు వాళ్ల పనులు మానుకొని మావెంట బాడీగార్డుల్లా రావాల్సిన అవసరమే లేదంటుంది రేఖ.

తెలుగు తెరపై వారసుల వెల్లువ

తెలుగు సినీ పరిశ్రమలో వారసుల వెల్లువ కొనసాగుతూనే వుంది. ఎన్టీఆర్, తారకరత్న బాటలో సినీపరిశ్రమలోని ముఖ్యుల వారసులు రంగప్రవేశం చేస్తున్నారు. ప్రముఖ నటుడు మోహన్‌బాబు కుమారుడు ఈ ఏడాది చివర్లోగానీ, వచ్చే ఏడాది ప్రారంభంలో సినీ రంగ ప్రవేశం చేయవచ్చు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుమారుడు హీరోగా ఆరంగ్రేటం చేయనున్నాడు. రామానాయుడు మనమడు, మంత్రి బాబూ మోహన్ కుమారుడు, ప్రముఖ నిర్మాత కె.ఎస్. రామారావు కుమారుడు త్వరలో హీరోలుగా వెండి తెరపై కనపడనున్నారు. పంపిణీదారుడు సుధాకరరెడ్డి కుమారుడు నితిన్, జయం చిత్రం ద్వారా సక్సెస్ కావడంతో మరికొందరు డిస్ట్రిబ్యూటర్లు కూడా తమ వారసులను హీరోలు చేయనున్నారు. ఇక వెండి తెరపై వారసుల వెల్లువే.

సగటు ప్రేక్షకుడిలా ఆలోచిస్తాను

విజయాల బాటలో పయనిస్తున్న హీరో ఉదయకిరణ్‌ను తాను నటించే సినిమా కథలను ఎలా ఎంపిక చేసుకొంటారని అడిగితే, సమాధానం చెబుతూ సినిమా తర్వాత సినిమాకు మంచి కథను ఎంపిక చేసుకోవడం కత్తిమీద సామే. నేను సినిమా కథ వినేటప్పుడు ఓ సగటు ప్రేక్షకుడిలా ఎంజాయ్ చేస్తాను. నాకు కథ నచ్చితే ఆ తర్వాత కొద్దిసేపు కళ్లు మూసుకొని అందులోని హీరో పాత్రకు నన్ను నేను అన్వయించుకొని చూసుకొంటాను. ఆ క్యారక్టర్‌కు నేను సరిపోతానను కొంటే అప్పుడేటకే చేస్తాను. కథను ఇలా ఎంపిక చేసుకోవాలనే సూక్ష్మాన్ని నాకు నేర్పింది నా గురువు తేజగారు. ఆయన నువ్వు నీ కెరీర్‌ను డైరక్టర్స్ హీరోగా మలుచుకో. అప్పుడే దీర్ఘకాలిక కెరీర్‌కు బాటలు వేసుకో గలుగుతావు. అలా కాకుంటే నీకంటూ ఓ ఇమేజ్‌ను సృష్టించుకొంటే నటుడిగా కొన్ని పరిమితుల్లో బంధీ అవుతావన్నారు. దీన్ని మనసులో పెట్టుకొని కెరీర్‌ను, క్యారెక్టర్లను ప్లాన్ చేసుకొంటున్నట్లు ఉదయకిరణ్ వివరించాడు.

కవిత్వం రాశాను - ప్రోత్సాహమే లేదు

ఖుషీ ఫేమ్ భూమికకు అందమైన ప్రకృతిని చూసినప్పుడు తదమరచి పరవశించి పోవడం అలవాటు. భూమిక చదువుకొనే రోజుల్లో డార్జిలింగ్ వెళ్లిందట. అక్కడి కొండలు, లోయలు, పచ్చదనం, మంచుతెరలు చూసి మనసు గిలిగింతలు పెట్టిందట. ఈ సందర్భంగా

చూడండి 11వ పేజీలో

భరతసింహారెడ్డి బాగాలేదండీ!

"భరతసింహారెడ్డి" అనగానే సమరసింహారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఆదికేశవరెడ్డి చిత్రాల్లాగా రాయలసీమ ఫ్యాక్షనిజంతో కూడుకున్న చిత్రమనుకునే అవకాశం వుంది. కాని ఈ చిత్రంలో రాయలసీమ ముఠా కక్షల ప్రసక్తేలేదు. ఇది ఒక కుటుంబ కథా చిత్రంగా రూపొందింది. కొడుకు, తండ్రుల మధ్య ఏర్పడ్డ బద్ధ విరోధం రెండు కుటుంబాల తగాదా, మూలకథగా సాగుతుంది. సూర్యప్రకాష్ కథ, స్క్రీన్‌ప్లే వ్రాసి దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంలో ఒకే రూపంలో వుండే కొడుకు, తండ్రి పాత్రలను రాజశేఖర్ పోషించాడు.

చిన్నతనంలోనే రాజా అనే కుర్రవాడికి తన తండ్రి మీద శత్రుత్వానికి బీజం పడుతుంది. తండ్రిపై పగ సాధించేందుకు కొడుకులో పౌరుషం, ప్రతీకారం బాగా నూరి పోయ్యబడ్డాయి. అది ఎలా జరిగిందంటే, భరత సింహారెడ్డి (రాజశేఖర్) ఆ ప్రాంతానికి గొప్పవాడుగా పేరుగాంచాడు. అతనికి భార్య (మీనా), కొడుకు రాజా (రాజశేఖర్) వుంటారు. ఒక అనాథను (రవళి) ఆశ్రయమిచ్చి

చిత్రసమీక్ష

గ్రిద్దలూరు గోపాలరావు

భార్య రహస్యంగా, అతని చెల్లెల్ని తీసుకొని పుట్టింటికి పోతుంది. తన చిన్నారి కొడుకు రాజాను ఇంటి వద్ద వదిలేసి పోతుంది. తన భర్త చెల్లిని పెళ్లి తన అన్నతో జరిపిస్తుంది. హఠావిడిగా పరుగు తీసిన భరతసింహారెడ్డి, తన చెల్లిలు పెళ్లి తన భార్య అన్నతో జరిగిపోవటం చూసి తాను చేసిన శపథం ప్రకారం వెంటనే ఒక మంగలిని పిల్చి తన మీసం గొరిగించుకొంటాడు. భరతసింహారెడ్డి, బావి దగ్గర స్నానం చేస్తాడు. అంటే తనభార్యకు, చెల్లికి అతను తిలోదకాలు వదిలేసినట్లు లెక్క.

తన చెంత వున్న దిక్కులేని అమ్మాయిని, తన చిన్నారి కుమారుడు రాజాను, తన ప్రాణ మిత్రుడైన ఒక పెద్దమనిషి వద్ద వుంచుతాడు. భరతసింహారెడ్డి మీద మనసు నిలుపుకొన్న ఒక స్త్రీ, తన కోరికను అతను మన్నించక పోవటంతో అతనిమీద ప్రతీకార చర్యకు పూనుకొంటుంది. చిన్నారి రాజాను తన వద్దకు చేరదీసుకొని భరతసింహారెడ్డి పట్ల రాజాకు శత్రుత్వం నూరిపోస్తుంది. తన పంచన వున్న అనాథను (రవళి) వుంచుకొని, నీ తల్లిని, నిన్ను వదిలేసిన నీచుడు నీ తండ్రి అని రాజాకు చెప్పి భరతసింహారెడ్డి పట్ల ప్రబల విరోధిగా రాజాను తయారు చేస్తుంది. దాంతో రాజా తన వయస్సు తోపాటు తండ్రిపట్ల శత్రువుగా ఎదుగుతాడు. తన తండ్రిని ఎదిరిస్తాడు. కక్ష సాధిస్తాడు. చివరకు అసలు నిజం ఫ్లాష్‌బ్యాక్ లో తెలుసుకొని పశ్చాత్తాపపడతాడు. భరతుడు, రాముడి పాదాలకు

చూడండి 11వ పేజీలో

వారఫలాలు

తేది21.9.2002 నుండి 27.9.2002వరకు వృషభంలో రాహువు; మిథునంలో శని; కర్కాటకంలో గురువు; సింహంలో కుజుడు; కన్యలో రవి, బుధులు; తులలో శుక్రుడు; వృశ్చికంలో కేతువు; మీన, మేష, వృషభాలలో చంద్రుడు.



మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1పాదం)

ఆర్థికస్థితి బాగుంటుంది. కాని అనుకోని ఖర్చులు పెట్టక తప్పదు. పనులు సరిగా జరగక వత్తిడికి లోనవుతారు. రుణవసతిని పొందుతారు. ఉద్యోగులకు మార్పులు, అధికారుల సహకారం బాగుంటుంది. రాజకీయ వర్గాలకు సందడి ప్రజాబలం పెరుగుతుంది. న్యాయపరమైన వాజ్యాలు వాయిదా వేసుకోండి. వాణిజ్య పెట్టుబడి రంగాలలో అవకాశాలు చేజారిపోవచ్చు. ఆరోగ్యం జాగ్రత్త. శుభకార్యానుకూల సమయమిది. విద్యాప్రగతి బాగుంటుంది.



వృషభం


(కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశీర్ష 1,2పాదాలు)

ఆర్థికస్థితి సామాన్యంగా ఉంటుంది. వృత్తి, ఉద్యోగాలలో శ్రమ ఉంటుంది. పలుకుబడి, కార్యసాధకత్వ సామర్థ్యం బాగుంటుంది. పెద్దలను కలుసుకుంటారు. అధికారుల సహకారం బాగుంటుంది. పనులు బాగా సాగుతాయి. కాని మానసికాందోళన ఎక్కువగా ఉంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వ్యవసాయదారులకు చిక్కులు, సమస్యలు రావచ్చు. కొత్త వస్తు, వాహనాలు కొనడం, కుటుంబంలో చిన్నచిన్న విభేదాలు కలుగవచ్చు.

మిథునం

(మృగశిర3,4పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

వృత్తి, వ్యాపార, వ్యవసాయ రంగాలలో ఆదాయం బాగుంటుంది. వాణిజ్య విస్తరణకు అవకాశాలు పొందడం, స్థిరాస్తుల కొనుగోలు ప్రయత్నాలు, స్థిరాస్తులపై ఆదాయం బాగుంటుంది. విద్యలకు ఉద్యోగావకాశాలు రావడం, ఉద్యోగులకు కొంత మార్పులుండే అవకాశం, అధికారవర్గ, బంధువుల సహాయం పొందడం జరుగుతుంది. శుభకార్య నిర్ణయాలు జరిగే అవకాశాలున్నాయి. రాజకీయ ప్రాబల్యం పెరుగుతుంది. తగాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.



కర్కాటకం

(పునర్వసు 4పాదం, పుష్య, ఆశ్లేషలు)

వృత్తి, వ్యాపార రంగాలలో ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. ఆదాయవృద్ధి ఉంటుంది. కాని అనుకోని కొన్ని కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులలో ఒకరికి కొద్ది అనారోగ్యం, అల్పులతో తగాదాలు జరగవచ్చు. అనుకున్న పనులు ముందుకు సాగుతాయి. ఉద్యోగ వర్గాలకు, రాజకీయ వర్గాలకు బాగుంటుంది. డబ్బు పెట్టుబడికి వ్యాపార అవకాశాలు, ఎదురు చూసే రుణాలు పొందడం జరుగుతుంది. విద్యార్థులకు అభివృద్ధి ఉంటుంది. వారం మధ్యలో శుభవార్తలు వింటారు.



సింహం

(మఖ, పుబ్బ, ఉత్తర 1వపాదం)

ఈ వారం ఖర్చులు ఎక్కువగా వుంటాయి. ఆదాయం సామాన్యం . కోర్టు వ్యవహారాలు, ఉద్యోగ ఫైళ్లు అనుకూలంగాలవు. పిల్లలకు ఆరోగ్యలోపం ఉంటుంది. వాణిజ్య విస్తరణ, స్థిరాస్తులపై నుండి కొద్దిపాటి ఆదాయం వుంటుంది. శుభవార్తలు వినడం జరుగుతుంది. అధికారుల సహకారం బాగుంటుంది. వారం మొదట కొద్ది అనారోగ్యం, విద్యార్థులకు ఏకాగ్రత తగ్గడం వుంటుంది. పనులు సాధించుకొనగల సామర్థ్యం ఉంటుంది. వస్తువులు, ఆస్తుల కొనుగోలు వాయిదాపడవచ్చు. కుటుంబ సౌఖ్యం ఉంటుంది.



కన్య

(ఉత్తర 2,3,4పాదాలు, హస్త, చిత్త 1,2పాదాలు)

ఆరోగ్యం కాపాడుకోవాలి. చిన్న గాయాలు తగలవచ్చు. వాహన, వస్తు రిపేర్లుంటాయి. ఆర్థికంగా ఈ రాశి వారికి బాగుంటుంది. కుటుంబ సభ్యుల సహకారం, శుభకార్య ప్రయత్నాలు జరుగుతాయి. ఉద్యోగులకు సామాన్యంగా గడిచిపోతుంది. పేర్లు, పెట్టుబడుల మీద ఆదాయం కొంత పెరుగుతుంది. కోర్టు వ్యవహారాల అనుకూలత, అనుకున్న పనులు

పంచాంగం

తేది 22 ఆదివారం మహాలయపక్షారంభం.

సెప్టెంబర్ తిథులు
భాద్రపద బహుళ

తేది 21	శని	పౌర్ణమి	సా 6.05గం.లకు
తేది 22	ఆది	పాడ్యమి	రా 8.00గం.లకు
తేది 23	సోమ	విదియ	రా 10.05గం.లకు
తేది 24	మంగళ	తదియ	రా 12.10గం.లకు
తేది 25	బుధ	చతుర్థి	రా 2.00గం.లకు
తేది 26	గురు	పంచమి	రా3.30గం.లకు
తేది 27	శుక్ర	షష్ఠి	రా 4.30గం.లకు

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఏ.

జరగడం ఉంటుంది. బంధువుల రాకపోకలుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది.



తుల

(చిత్త3,4పాదాలు,స్వాతి, విశాఖ 1,2,3పాదాలు)

పనులు నిర్ణయం చేసి జరపడంలో అస్థిరత ఉంటుంది. సరిగా పనులు జరుగవు. వాణిజ్య, వృత్తి రంగాలలో ఆదాయం సరిగా ఉండదు. బంధువర్గంలో అనారోగ్యబాధలు, అధికారుల వేధింపులు, రాజకీయవర్గాలకు ఎదురుపోటీలు ఉంటాయి. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. కోర్టు వ్యవహారాలు, బాకీల వ్యవహారాలు పెండింగ్‌లో పడతాయి. స్థిరాస్తుల మీద స్వల్ప ఆదాయం ఉంటుంది. విద్యార్థులకు మంచి ప్రగతి ఉంటుంది.



వృశ్చికం

(విశాఖ 4పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

అనుకున్న పనులు సరిగా జరగక వత్తిడికి లోనవుతారు. ఆస్తి వ్యవహారాలు, కుటుంబ వ్యవహారాలు ఆందోళన కలిగిస్తాయి. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. ఆదాయ, వ్యయాలు సమానంగా ఉంటాయి. వాణిజ్యాభివృద్ధి ప్రయత్నాలు, పెట్టుబడి రంగాలలో మీ ప్రయత్నాలు అనుకూలించక పోవచ్చు. అనవసర వివాదాలలో తలదూర్చడం, అల్పులతో తగాదాలు రావచ్చు. విద్యాప్రగతి బాగుంటుంది. కుటుంబ ముఖ్యులకు ఆరోగ్య లోపం కలుగవచ్చు.



ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

అనుకున్న పనులు సరిగా జరగవు. దీర్ఘమైన ఆలోచనలు, ఆందోళన ఉంటుంది. ఆరోగ్య లోపం ఉంటుంది. రుణాల వ్యవహారాలు, న్యాయవ్యవహారాలు అనుకూలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు బాగుంటాయి. ఆదాయం పెరుగుతుంది. రాజకీయ ప్రాబల్యం పెరుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు, వారం మొదట వస్తు నష్టం ఉంటుంది. కుటుంబ సభ్యులకు వాణిజ్య భాగస్వామ్యాలు, ఉద్యోగావకాశాలు లభించవచ్చు. అనుకోని కొద్ది ఆదాయం వారాంతంలో దొరకవచ్చు. విద్యాప్రగతి మెరుగుగా ఉంటుంది.



మకరం

(ఉత్తరాషాడ2,3,4పాదాలు, శ్రవణ ధనిష్ట1,2పాదాలు)

పెండింగ్ సమస్యలు పరిష్కారం కాకపోవడం, అనుకున్న పనులు సరిగా ఉండకపోవడం, కుటుంబంలో వ్యక్తుల మధ్య విభేదాలుంటాయి. ఆర్థికస్థితి బాగుంటుంది. కొంత ఖర్చు కూడా ఇతరులకై పెట్టవలసి వస్తుంది. అధికారవర్గ సహకారం ఉద్యోగులకు పరిగా ఉండదు. వాహన రిపేర్లు, శరీర అనారోగ్యం ఉంటుంది. రాజకీయ వర్గాలకు ప్రతిష్ఠాహాని అపరోధాలుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది. పెట్టుబడి, షేర్ల, స్థిరాస్తుల నుండి కొద్ది ఆదాయం వుంటుంది.



కుంభం

(ధనిష్ట 3,4పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3పాదాలు)

ఆర్థికంగా బాగుండి ఆదాయ వనరులు పెరుగుతాయి. బంధువర్గంతో విభేదాలు రావచ్చు. సాహసాలు చేసి కష్టపడతారు. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. శుభకార్య ప్రయత్నాలు జరుగుతాయి. అధికారుల వల్ల ఇబ్బందులు పడతారు. రాజకీయ ప్రాబల్యానికి అడ్డంకులు రావచ్చు. వాణిజ్య వర్గాల వారు తొందరపాటు వల్ల అవకాశాలు పోగొట్టుకొనవచ్చు. దైవకార్యాలలో పాల్గొనడం, కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, పనులు సమర్థవంతంగా జరుపుకోలేక [illegible] అనాసక్తి ఉంటుంది.

మీనం

(పూర్వాభాద్ర 4పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

ఆర్థికాభివృద్ధికి ఆలోచనలు ప్రయత్నాలు పెంచుతారు. కుటుంబాదాయం పెరుగుతుంది. వాణిజ్య విస్తరణావకాశాలు అందుబాటు కాగలవు. కొంత రుణాల ప్రయత్నాలు చేస్తారు. అనుకున్న పనులు సాఫీగా సాగుతాయి. కుటుంబంలో శుభకార్య ప్రస్తావనలు, ఉద్యోగులకు పదోన్నతి అవకాశాలు ఏర్పడుతాయి. అధికార వర్గాలతో చెలిమి ఉంటుంది. రాజకీయ వర్గాల వారు ప్రాబల్యం పెంచుకొంటారు. బిడ్డలకు విద్యావృద్ధి, ఉద్యోగావకాశాలు బాగుంటాయి. నూతన పరిచయాలు, ప్రయాణాలుంటాయి.

జనవాణి

3వ పేజీ కొరవ

ముందే బ్రిడ్జి లోపల రోడ్డు పూర్తిగా దెబ్బ తినేసింది. చిమ్మ చీకటి, నాలుగు చినుకులు రాలితే మోకాలు లోతు నీళ్లు. బ్రిడ్జి బ్రహ్మాండంగా వున్నట్లు రైల్వే గేటు వద్ద పోలీసులు డివైడర్లు కట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. మొత్తానికి బాక్స్‌టైప్ బ్రిడ్జి మూణ్ణాళ్ల ముచ్చటే అయ్యింది.

నెల్లూరు *కె. కేశవరావు*

వినాయక విగ్రహాలకు బంకమట్టి వాడాలి

వినాయక చవితి హిందువులకు ఎంతో ముఖ్యమైన పండుగ. ఈ పండుగలో భాగంగా ప్రతిష్ఠించే వినాయక విగ్రహాల నిమజ్జనం తప్పని సరి. ఈ మధ్య వినాయక విగ్రహాలను యంత్రాలతో తయారు చేస్తూ, ఆకర్షణీయంగా కనపడేందుకు రంగుల్లో రకరకాల కెమికల్స్ వాడుతున్నారు. ఈ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో నీరు కలుషితమవ్వడంతో పాటు కెమికల్స్ వల్ల నీటిలో జీవించే జీవరాశులు చేపలు, తాబేళ్లకు ప్రాణహాని కల్గుతుంది. వినాయక ఉత్సవాల నిర్వాహకులు బొమ్మలన్నింటిని బంకమట్టితో తయారు చేసి ధాన్యం, కూరగాయలు, పండ్లతో అలంకరణ చేసి, నిమజ్జనం చేస్తే నీటిలో సులభంగా కరిగిపోతాయి. ఇతర వస్తువులు జీవరాశులకు ఆహారంగా వుపయోగ పడతాయి. ఈ సూచనను గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు పాటిస్తే బాగుంటుంది.

నెల్లూరు *సోలా జానకీదేవి*

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

విద్యుత్ శాఖాధికారులకు డబ్బు మీద వుండే వ్యామోహం విధుల మీద లేదు. నెల్లూరుపట్టణంలో చాలా చోట్ల ట్రాన్స్‌ఫారాలు రోడ్ల పక్కనే పెట్టేసి వున్నారు. గతంలో ట్రాన్స్‌ఫారం చుట్టూ తీగతో కంచె వేసే వారు. ఇప్పుడు ట్రాన్స్‌ఫారాల చుట్టూ ఎక్కడా కంచె లేదు. స్కూల్ పిల్లలకు అందేంత ఎత్తులోనే ఫీజు బాక్సులుంటున్నాయి. రాత్రి వేళల్లో ఏదైనా వాహనాలపై వెళ్లే వాళ్లు ట్రాన్స్‌ఫారాలను ఢీ కొడితే ఎంత ప్రమాదమో ఊహించుకొంటేనే వళ్లు జలదరిస్తోంది. ట్రాన్స్‌ఫారాల వద్ద కంచె ఏర్పాటుకు విద్యుత్ శాఖ వున్నతాధికారులు తక్షణం సదుం కట్టాలి.

నెల్లూరు *టి.వి. నారాయణ*

అధికారం కాదు ప్రజల సంక్షేమం ముఖ్యం

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర మేయర్ల సమావేశంలో మేయర్లు తమకు మరికొన్ని అధికారాలు కావాలని, కమిషనర్ల అధికారాలు తగ్గించాలని తీర్మానాలు చేశారు. తమకు క్యాబినెట్ మంత్రివోదా ఇవ్వాలని, విదేశీ ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని కూడా ఈ సమావేశం డిమాండ్ చేసింది. మేయర్లు, కమిషనర్లు అధికారాల కోసం పోరాటం మాని ప్రజల సంక్షేమాన్ని ఆలోచిస్తే కార్పొరేషన్లలో పలు సమస్యలు పరిష్కారమవుతాయి.

హైదరాబాద్ ప్రొఫసర్ నాగరాజారావు

ఎందుకీ వీడియో కాన్ఫరెన్సులు?

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్సుల పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగ పరుస్తున్నారు. ఆయన సమీక్షను కాన్ఫరెన్స్ తర్వాత అధికారులు మర్చిపోతున్నారు. గతంలో వారానికి ఒకసారి జరిగే ఈ వీడియో కాన్ఫరెన్స్‌లు ప్రస్తుతం ప్రతినెల చివరన జరుగుతున్నాయి. వీటికి ప్రభుత్వ శాఖల్లోని ఆయా శాఖాధిపతులంతా హాజరుకావాలి. జూన్30, జులై30తేది ప్రభుత్వ శాఖల్లో చాలామంది వుద్యోగులు పదవీ విరమణ చేశారు. వీరి సన్మానానికి అధికారులెవరూ అందుబాటులో లేకుండా పోయారు. పదవీ విరమణ చేసే వుద్యోగులకు సన్మానం పి తీపి గుర్తు. వీటిని వీడియో కాన్ఫరెన్సులు కలిపించడం బాధాకరం.

నెల్లూరు *బి. శివరామ్‌సింగ్*

వేణుగోపాల్‌రెడ్డి గొప్ప వ్యక్తి!

సెప్టంబర్ 6తేది జమీన్‌రైతు సంచికలో బిజెపి ముఖ్య నాయకుడు వేణుగోపాలరెడ్డి పంపిన వివరణ ప్రచురించి ఎంతో మంచిపని చేశారు. వేణుగోపాలరెడ్డి తన పూర్తి సమయాన్ని పార్టీకి వెచ్చిస్తూ ప్రచారక్‌గా జీవితం కొనసాగిస్తున్నాడు. వాజపేయిలానే వేణుగోపాలరెడ్డి బ్రహ్మచారి. ఈ రోజుల్లో నిస్వార్థంతో పనిచేసే వ్యక్తులు కేవలం ప్రచారక్‌ల రూపంలో సంఘ పరివార్ వంటి సంస్థలలో మాత్రమే కనపడతారు. కుశభవ్‌ఠాక్రే, సుందర్‌సింగ్ భండారి, గోవిందాచార్య, వాజపేయి కోవకు చెందిన వేణుగోపాల్‌రెడ్డిపై నింద మోపడం బాధాకరం. వేణుగోపాల్‌రెడ్డి వంటి నిబద్ధత గల వ్యక్తులపై వార్తలు వ్రాసే సమయంలో సంయమనం పాటించండి.

నెల్లూరు *బయ్యావాసు*

బాలాజీ నగర్ వీధులకు పేర్లు పెట్టండి

నెల్లూరు పట్టణ తూర్పు ప్రాంతమైన బాలాజీ నగర్ ఇటీవల బాగా విస్తరించింది. ఈ ప్రాంతంలోనే వాసవీ నగర్, లక్ష్మీనగర్, సరస్వతీనగర్, బ్యాంకు కాలని, సాయిరాంనగర్ ప్రాంతాలు ఏర్పడ్డాయి. ఇక్కడి వీధులకు పేర్లు లేవు. పాలబూత్ సెంటర్, చెప్పుల ఫ్యాక్టరీ, లక్కీ బోర్డు సెంటర్లు మాత్రమే అందరికీ తెలుసు. ఆటోలు, రిక్షా, చివరికి పోస్టల్‌వాళ్లు సైతం వీధులు తెలియక తిప్పలు పడుతున్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని మునిసిపాలిటి ఈ ప్రాంతంలోని వీధులకు పేర్లు పెడితే బాగుంటుంది.

నెల్లూరు *బి.పట్టాభిరామయ్య*

50 ఏళ్ల క్రితం

3వ పేజీ కొరవ

తగ్గి పోగలదని, ఎలక్ట్రిసిటీ మూడు జిల్లాలకు సరిపోగలదని అవసరమైతే కడప జిల్లా ప్రజలకు పూర్తిగా మునక తప్పించుటకు, సోమశిల వద్ద బోరెజ్ నిర్మించిన చాలునని, నందికొండ రిజర్వాయరు నుండి వీలైనంతవరకు పెన్న ఉత్తర భాగానికి నీరు సరఫరా చేయాలని తీర్మానించారు.

నెల్లూరు ముచ్చట్లు

బ్రాతల్సు కేసు

పద్మా లాడ్జి వారి మీద మాజీ సర్కిల్ ఇన్‌స్పెక్టరు కాలంలో బ్రాతల్సు ఆక్టు కింద కేసు పెట్టబడినది. పద్మా లాడ్జి వారు సివిల్‌కోర్టు వరకు ఎక్కారు. చివరకు సర్కిల్ రామారావు 750 రూపాయలు ఖర్చులిచ్చి రాజీ పడ్డారట. అంటే ఇక పోలీసులు బ్రాతల్సు కేసు పెట్టడానికి ముందుకు రావడం అపాయకరమే గదా!

-విమర్శకుడు

నెల్లూరుసంగతులు

4వపేజీ కొరవ

అవసరమైన వారికి రక్తమివ్వను రెడీ!

బిఎంఎస్ కార్మిక సంఘంలోని సభ్యుల్లో రక్తదానం చేసే వారితో డైరక్టరీని రూపొందించి అత్యవసరమైన వారికి రక్తదానం చేస్తామని బిఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.వి.సాంబశివరావు చెప్పారు. బిఎంఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసి బస్టాండువద్ద 17తేది నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ మజ్దూర్ సంఘ్ కేవలం కార్మిక సంక్షేమం కోసం పనిచేయడమే కాకుండా సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. ప్రజ్ఞాభారతి సంఘటనా కార్యదర్శి వై.నరసయ్య మాట్లాడుతూ రక్తదానం మానవత్వానికి ప్రతీక న్నారు. సాక్రమ్ క్లినిక్ డైరక్టర్ సుధాకర్, అసంఘటిత కార్మిక సంఘ్ రాష్ట్ర కార్యదర్శి టి. ప్రసాదరావు, సిపెచ్. అజయ్ బాబు, డి.రవి ప్రకాష్, డాక్టర్ సూర్యనారాయణ, షేక్ ఖాదర్‌బాషా, కె. చంద్రశేఖర్, కె. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో 50మంది రక్తదానం చేశారు.

సరస్వతీనగర్‌లోని వీధులకు బోర్డులు

నెల్లూరు సరస్వతీనగర్‌లోని వీధులకు బోర్డులు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని 15తేది మునిసిపల్ ఛేర్మన్ శ్రీమతి అనురాధ ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని అన్ని వీధులకు దాదాపు 36 బోర్డులను మాడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి తన స్వంత ఖర్చుతో తయారు చేయించి ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మునిసిపల్ ఛేర్మన్ అనురాధ మాట్లాడుతూ సరస్వతీనగర్‌వాసుల కష్టాలు వాకు తెలుసు. ఇక్కడి ప్రజలు రోడ్లు, డ్రైనేజి కాలువలు, కొళాయిలు, వీధి దీపాలు లేక పోవడంవల్ల బాధపడుతున్నారు. వీటి పరిష్కారానికి సాధ్యమైనంత మేర కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీధర్ కృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చెంచులక్ష్మి, మాడరన్ స్కూల్ కరస్పాండెంట్ విజయకుమార్‌రెడ్డి, నేతాజీ స్కూల్ కరస్పాండెంట్ ఎమ్వీ సుబ్బారెడ్డి, సరస్వతీ నగర్ అభివృద్ధి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరిహర శర్మ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల అవార్డులకు ఆహ్వానం

జిల్లాలో 2001-2002సంవత్సరానికి ఉత్తమ సేవలందించిన యువజన సంఘాలకు నెహ్రూ యువక కేంద్రం అవార్డులిస్తుంది. రిజిష్టరు చేసిన యువజన సంఘాలు, గ్రామాభివృద్ధి, ఇతర కార్యక్రమాలలో పాల్గొనివుంటే వాటి వివరాలు, రుజువులు జతపరుస్తూ దరఖాస్తులను 25తేదిలోగా పంపుకోవాలి. యువకులు వ్యక్తిగతంగా చేసిన సేవలకు సైతం యువజన వ్యక్తిగత అవార్డు ఇస్తారు. దరఖాస్తులను కోఆర్డినేటర్, నెహ్రూ యువకేంద్ర, వెల్లూరు-3 చిరునామాకు పంపాలి.

కళాకారులకు పెన్షన్లు విడుదల

జిల్లాలో గతంలో పెన్షన్లు తీసుకొంటున్న 159 మంది వృద్ధ కళాకారులకు నెలకు 500రూపాయల వంతున ఈ ఏడాది ఆగష్టు, సెప్టెంబరు నెలలకుగాను ప్రభుత్వం లక్షా 59వేల రూపాయలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనంతరాము చెప్పారు. వీటిని కళాకారులు డిపిఆర్ఓ కార్యాలయానికి తీసుకోవచ్చని, వృద్ధ కళాకారులు రాలేని పక్షంలో డాక్టర్ సర్టిఫికేట్, సంబంధిత ఎమ్మార్వో దగ్గర ధృవీకరించిన ఉత్తర్వులు సంబంధీకుల ద్వారా పంపినట్లయితే కళాకారులకు చెక్కులు అందజేస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.

గణేష్ ఉత్సవ సమితి సన్మానాలు

వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను పెన్నానదిలో నిమజ్జనం చేసేందుకు అన్ని విధాలుగా సహకరించిన ముగ్గురు ప్రముఖులను సింహపురి గణేష్ ఉత్సవ సమితి సభ్యులు స్వయంగా వెళ్లి సన్మానించారు. మునిసిపాలిటి తరపున అన్ని ఏర్పాట్లు చేసిన ఛేర్మన్ అనురాధ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి సల్పిన ఎస్పీ రాజేంద్రనాథ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ రాంబాబులను సన్మానించారు. వీరిలో సమితి నగర కన్వీనర్ బయ్యా వాసు, మెంటా రామ్మోహన్, బట్టు రామకృష్ణ, పట్టణంలోని పలుచోట్ల వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రముఖులు కూడా వున్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

నెల్లూరు జిల్లా కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష వ్రాయగోరు విద్యార్థులు, పూర్తి చేసిన దరఖాస్తులు పంపేందుకు గడువును పెంచారు. అక్టోబర్ 30తేదిలోగా దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారులకు అందజేయవచ్చని, దరఖాస్తులు డిఇఓ, ఎంఇఓ కార్యాలయాలు, నవోదయ ప్రిన్సిపల్ కార్యాలయంలో దొరుకు తాయని కృష్ణాపురం నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం.పాల్ సత్యకుమార్ తెలిపారు.

పైలెట్ ప్రాజెక్ట్ గూర్చి తెలియ జెయ్యండి

గ్రామాలలోని ప్రజలకు మంచి నీరు, పారిశుధ్యం నిర్వహణపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అనంతరాము కోరారు. సోమవారం క్యాటరాన్ శిక్షణా కేంద్రంలో పైలెట్ ప్రాజెక్ట్ రెండవ దశ శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్ట్‌ను రెండవ దశలో 17మండలాల్లో చేపడతారు. ఎమ్మార్వోలు, ఎమ్డీఓలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీర్లు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి పైలెట్ ప్రాజెక్ట్‌పై ప్రజలలో అవగాహన కల్పించి ఈ ప్రాజెక్ట్‌ను ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలన్నారు. నిరుపయోగంగా వున్న పథకాలను సైతం ఈ ప్రాజెక్ట్‌లో సరిచేద్దాం. ప్రాజెక్ట్ గూర్చి ప్రజలకు తెలియజేసి వారి వద్ద నుంచి ప్రాజెక్ట్ వ్యయంలో పది శాతం వసూలు చేసే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరక్టర్ డాక్టర్ జగన్మోహన్ కూడా పాల్గొన్నారు.



విజయా కనకమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె ఫోటోకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బృందం.



అక్కారైతులపై పోలీసు లాఠీ ఛార్జికి నిరసనగా రాజపాళెంలో రాస్తారోకో చేస్తున్న జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు.

అత్యాచారం

4వ పేజీ కొరవ

స్తున్న పేద ప్రజానీకం తమకు మంచినీరు సరఫరా కావడంలేదని ఆరోపిస్తున్నారు. వున్నతాధికారులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

వెల్లువ

9వ పేజీ కొరవ

హృదయం లోతులనుంచి వచ్చిన భావాలను ఒక కవితగా వ్రాసి పత్రికకు పంపిందట. రెండునెలలపాటు ప్రతివారం నరాలు తెగే ఉత్కంఠతతో ఆ పత్రిక పేజీలన్నీ వెతికేదట. రెండునెలల తర్వాత పత్రిక నుంచి తిరిగొచ్చిన తన కవిత చూసి భూమిక తల్లడిల్లి పోయిందట. ప్రచురణార్హత లేని కవిత్వం వ్రాయడమెందుకని అప్పుడే నిర్ణయించుకొన్నాను. నాలో భావావేశం తరచూ ఉప్పొంగుతున్నా కవితల జోలికి మాత్రం వెళ్లడం లేదని భూమిక బాధపడుతూ చెప్పింది.

అసిస్టెంట్ డైరక్టర్ హీరో అయ్యాడు

6టీన్స్, గర్ల్‌ఫ్రెండ్ చిత్రాల్లో హీరోగా గుర్తింపు తెచ్చుకొన్న రోహిత్ చేతిలో చాలా చిత్రాలున్నాయి. రోహిత్ సినీ పరిశ్రమలో ప్రవేశించడానికి ముందు తమ్మారెడ్డి భరద్వాజ వద్ద అసిస్టెంట్ డైరక్టర్‌గా చేరి 'స్వర్ణక్క' చిత్రం ద్వారా మొదట అదృష్టం పరీక్షించుకొని, 6టీన్స్ ద్వారా హీరో అయ్యాడు. తన కెరీర్ గూర్చి రోహిత్ వివరిస్తూ ఇంతకు ముందు పాత్రల ఎంపిక విషయంలో ఒకటి రెండు తప్పులు చేశాను. గర్ల్‌ఫ్రెండ్ సక్సెస్ నాపై పెద్ద భారాన్నే మోపింది. కథల విషయంలో ఇప్పుడు ఆచి తూచి అడుగు వేస్తున్నాను. 6టీన్స్ చిత్రంలో దేవుడు వరమందిస్తే పాట హిట్ అయినప్పటినుంచి నా చిత్రాల్లో ప్రత్యేక శ్రద్ధ కనుపరుస్తున్నాను. అదృష్టం కొద్ది గర్ల్‌ఫ్రెండ్‌లోనూ మంచి పాటలు కుదిరాయి. ఆర్టిస్టుగా చక్కటి గుర్తింపు, వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలన్నది తన కోరికన్నారు.

ప్రేమచిత్రం తీస్తున్న రాఘవేంద్రరావు

తన వందవ చిత్రంగా మల్టీస్టారర్ చిరంజీవి, నాగార్జున, వెంకటేష్‌ను పెట్టి చిత్రం తీస్తానని ప్రకటించిన దర్శకుడు రాఘవేంద్రరావు తన మనసు మార్చుకొన్నాడు. ప్రస్తుతం నడుస్తున్న యూత్ ట్రెండ్‌లో డిఫరెంట్ బ్యాక్ డ్రాప్‌తో నూతన హీరో, హీరోయిన్లతో చక్కని ప్రేమకథను తీసుకొని సంగీతపరంగా అన్ని వర్గాలను ఆకట్టుకొనేలా స్క్రిప్ట్ రూపొందించారు. ఈ చిత్రానికి అశ్వనీదత్, అల్లుఅరవింద్ నిర్మాతలు. చైనా బోర్డర్‌లో షూటింగ్‌కు ఈ నెల 20తేది బయలుదేరి వెళ్తున్నట్లు నిర్మాత అశ్వనీదత్ చెప్పారు.

చిత్రసమీక్ష

9వ పేజీ కొరవ

మొక్కినట్లు రాజా తన తండ్రి కాలి బూట్లను కళ్లకద్దుకొంటాడు. పేరులో వున్న ఎమోషన్ చిత్రంలో కనిపించదు. భరతసింహారెడ్డి హోదాకు, ధీమాకు తగ్గస్థాయిలో సన్నివేశాలు కుదరలేదు. విపరీతంగా తాగటం, భరతసింహారెడ్డి ఇంటి ముందు నిలబడి తండ్రిని రాజా ఇష్టమొచ్చినట్లు తిట్టడం, ఆ వీధిన వెళ్లే వాళ్ల చేత కూడా తిట్టించటం, తన చెల్లెల్ని, తన ఇష్టం లేకుండా తనభార్య ఆమె అన్నకిచ్చి పెళ్లి చెయ్యటంతో తాను వేసుకొన్న ఒట్టుప్రకారం, భరతసింహారెడ్డి మాసం గొరిగించుకోవటం, తనభార్యకు, చెల్లికి తిలోదకాలు ఇచ్చినట్టు బావి దగ్గర స్నానం చెయ్యటం ఇలా ఇంకా కొన్ని సన్నివేశాలు చాలా చొకబారుగా వున్నాయి. చిత్రమంతా అనవసరపు హడావిడి కనపడుతుంది. ఈ హడావిడి ప్రేక్షకులను ఆకట్టు కొంటుందని దర్శకుడు భ్రమించాడు. కాని ముఖం మొత్తినట్టుగా వుంది.

రాజశేఖర్ తండ్రిగా, కొడుకుగా బాగా నటించాడు. మీనాకు ఎంత ముసలి మేకప్ చేసినా తల్లిగా ఒదగలేదు. రాజా ప్రియురాలుగా గజాలా చిలిపిగా నటించింది. ఎం.వి.ఎస్. హరనాధరావు సంభాషణలు పరవాలేదు. ఎస్.ఎ.రాజ్‌కుమార్ సంగీతంలో రుచిలేదు.

వ్యాధులు

4వ పేజీ కొరవ

పిల్లల ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చు. రెండేళ్లుగా చిన్నపాటి అభివృద్ధి పనిచేయని పాలకులు పట్టణ పరిశుభ్రతకు నడుంబిగించాలి. అధికార యంత్రాంగం కుంభకర్ణ నిద్ర నుండి మేల్కొనాలి. ప్రజా సంక్షేమం కోరే వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు ప్రాణాంతక వ్యాధుల వ్యవహారమై ప్రజలను చైతన్య పర్చాల్సిన అవసరం ఎంతైనా వుంది.

నెల్లూరుకు చేస్తానన్నవి జాస్తి - చేసినవి నాస్తి!

వాగ్దాన భంగాలు మొదటిపేజీ కొరవ

వీటిలో ఏ ఒక్కటి అమలు చేసి వుండినా సూళ్లూరుపేట అభివృద్ధి తీరే వేరుగా వుండేది. నిజానికి మాంబట్టు లెదర్ పార్కు నిర్మాణం కాంగ్రెస్ హయాంలోనే మొదలయ్యింది. నేదురు మల్లి జనార్దనరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఇక్కడ కొంత భూమి సేకరించి ప్రాథమిక వసతుల కల్పనకు నిధులు కూడా మంజూరు చేశారు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే అది మూలపడిపోయింది. పులికాట్, ఇరకం దీవులలో పర్యాటక కేంద్రం ఏర్పాటుకు కూడా జనార్దనరెడ్డి హయాంలో ప్రయత్నం జరిగింది. నేలపట్టులో ఒక అతిథి గృహం, పక్షుల గురించి వివరించడానికి ఆడియో విజువల్ పరికరాలు కూడా సమకూర్చారు.

గూడూరు: ఇక్కడ ప్రధాన వాగ్దానం - టౌన్ తూర్పు, పడమరలను కలుపుతూ ఒక రైల్వే వంతెన. దీనికి రాష్ట్ర ప్రభుత్వ వ్యయం కూడా అవసరం లేదు. కేంద్రంలో తనకున్న పలుకుబడికి ఒక్కసారి రైల్వే మంత్రిని కలిసి చెప్పివుంటే జరిగిపోయి వుండేది. కాని 1999 ఆగస్టులో చేసిన ఈ హామీ ఇప్పటికీ అమలు కాలేదు. మరొక ముఖ్య వాగ్దానం - వాకాడు దగ్గర స్వర్ణముఖిపై హైలెవల్ బ్రిడ్జి. దీని ప్రయత్నం కూడా జనార్దనరెడ్డి హయాంలో జరిగింది. బ్రిడ్జి మాత్రమే కడితే రాకపోకలకు తప్ప. మరెందుకూ పనికి రాదు కాబట్టి, కొంచెం అదనపు ఖర్చుతో బ్యారేజి నిర్మించాలని తలపెట్టి, శంఖుస్థాపన కూడా చేశారు. అప్పట్లో 12కోట్ల రూపాయల నిధి బడ్జెట్‌లో కూడా మంజూరు చేశారు. చంద్రబాబు వచ్చి చేసిన పుణ్యం - ఆ నిధులు విడుదల చేయకుండా నిలిపి వేయడం. చల్లా కాలువ పైన ఒక వంతెన నిర్మిస్తామని, ఓడూరు దగ్గర ఒక బ్రిడ్జి కట్టిస్తానని కూడా మాట ఇచ్చి మర్చిపోయారు ముఖ్యమంత్రి.

రాపూరు: రాపూరు అంటే ముందు జ్ఞాపకం వచ్చేది కండ్లేరు నిర్వాసితుల సమస్యలే. వీటి మీద ముఖ్యమంత్రి రెండుసార్లు - 1996, 1999 ఎన్నికలలో హామీ ఇచ్చారు. రెండు సార్లూ మర్చిపోయారు. అంతకు క్రితం 1997 ఆగస్టు 3తేది జన్మభూమి పనుల పరిశీలనకు కందలపాడు గ్రామానికి వచ్చి, కనుపూరు కాలువ లైనింగ్ పనులకు నిధులు ఇస్తానని మాట చెప్పి వెళ్లారు; మళ్లీ తిరిగి రాలేదు. కండ్లేరు జలాశయం క్రింద 40వేల ఎకరాలకు తక్షణం నీటిపారుదల వసతి కల్పిస్తానని చెప్పారాయన. ఆ తక్షణ ముహూర్తం ఇంకా నిర్ణయం కానేలేదు.

సర్వేపల్లి: సర్వేపల్లికి సంబంధించి కృష్ణపట్నం వాగ్దానాలతో పాటు మైపాడు బీచ్ అభివృద్ధికి హామీ ఇచ్చారు. సర్వేపల్లి రిజర్వాయర్‌ను సమ్మర్ స్టోరేజి ట్యాంకుగా మారుస్తానని; ఇదే చెరువు నుంచి చుట్టు ప్రక్క గ్రామాలకు మంచి నీటి సరఫరా కోసం 11కోట్లతో ఒక పథకం నిర్మిస్తామని కూడా చెప్పారు. చేయలేదు.

కావలి: కావలి మంచినీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిస్తానని, ఇక్కడి ప్రజలు బిందెడు నీళ్ల కోసం అల్లాడి పోవడం చూసి తన మనసు చలించి పోతున్నదని ఎంతో నమ్మకంగా చెప్పాడు ముఖ్యమంత్రి. అంతే నమ్మకంగా ఆ హామీ మర్చి పోయాడు.


కోవూరు: కోవూరుకు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన ప్రధాన వాగ్దానాలు - సంగం ఆనకట్టకు బ్యారేజి; ఇఫ్కో ఫ్యాక్టరీ; కోవూరు చెరకు ఫ్యాక్టరీ ఆధునీకరణ. మొదటిది అప్పుడే మర్చిపోయాడు; రెండవదానికి కేంద్రం ఎగనామం పెట్టింది; మూడవదాని విషయంలో అసలు ఫ్యాక్టరీనే ప్రైవేటు వ్యక్తులకు అమ్మిపారేశాడు.

అల్లూరు: అల్లూరు పరిసరాల గ్రామాల మంచినీటి సమస్య పరిష్కారం కోసం ఒక సమగ్ర పథకం ప్రకటించి, శంఖుస్థాపన కూడా చేశారు - 2000 ఆగస్టు 2తేది. అంతే ఆ రాయి సమాధి రాయి వలే పడివుంది. దీని కోసం 5కోట్ల రూపాయల సొమ్ము విడుదల చేసినట్లు కూడా చెప్పారాయన; ఆ నిధులు హైదరాబాద్ నుంచి అల్లూరు వరకు ప్రయాణించడానికి ఎన్ని నెలలు పడుతుందో తెలియదు. అల్లూరులో 50 పడకలతో ఒక ఆస్పత్రి కట్టిస్తానని 1997 మే 8తేది జరిగిన సభలో ప్రకటించాడు. ఆరేళ్ల గడిచినా ఆ వూసే ఎత్తుకోలేదు. ఆ తర్వాత జరిగిన ఒక ఎన్నికల సభలో బిట్రగుంటను రైల్వే కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కేంద్రంతో మాట్లాడుతానని చెప్పాడు; ఇంకా తీరిక దొరికినట్లు లేదు పాపం.

ఆత్మకూరు: ఆత్మకూరు అంటే సోమశిల గుర్తుకు వస్తుంది ఎవరికైనా. చంద్రబాబు నాయుడుకు కూడా ఈ ఆనవాయితీ తప్పలేదు. 1999 పార్లమెంట్ ఎన్నికలు, 2002 పంచాయతీ ఎన్నికల సభలు రెండింటిలోనూ ఆయన సోమశిల గురించి ఎన్ని హామీలు ఇచ్చాడో లెక్కలేదు. రిజర్వాయర్‌లో పూర్తి సామర్థ్యం నీటి నిలువ; రెండు కాలువల దగ్గర రెండు విద్యుత్ ప్రాజెక్టులు; ఉత్తర కాలువ నిర్మాణం ముగింపు; దక్షిణ కాలువ చివర్ల వరకు పాడిగింపు వంటివన్నీ చెప్పి జనం చేత ఓట్లు వేయించుకొని వెళ్లారు. ఒక్కటి పట్టించుకోలేదు. బొగ్గేరు మీద హైలెవల్ బ్రిడ్జి కట్టిస్తానని, ఆత్మకూరు చెరువు అభివృద్ధి చేసి తాగునీటి సమస్య తీరుస్తానని, బైపాస్ రోడ్డు నిర్మిస్తానని చెప్పారాయన. చెప్పడం తప్ప చేసింది ఏదీ లేదు.

ఉదయగిరి: ఉదయగిరి వచ్చిన ప్రతిసారీ వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం తప్పక మొదలు పెడతామని చెప్పాడు. కనీసం సర్వేకు కూడా నిధులు ఇవ్వలేదు. సీతారాం సాగర్ ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేశాడు; పని ఇంకా శిలాఫలకం దగ్గరే వుంది. త్రాగునీటిలో ఫ్లోరోసిస్ వల్ల జనం రోగాల బారిన పడడం బాధాకరమని, ఈ సమస్యకు వెంటనే ఒక పరిష్కారం చూపెడతానని గొప్పగా ప్రకటించాడు. ఆ ప్రకటన అప్పుడే గాలిలో కలిసి పోయింది.

ఇట్లా చెప్పుకుంటూ పోతే ముఖ్యమంత్రి వాగ్దాన భంగాలు ప్రాయడానికి ఎన్ని పేజీలైనా చాలేటట్లు లేవు. ఆయన మాటలు చెప్పడం, జనం వాటిని నమ్మి ఓట్లు వేయడం పరిపాటి అయిపోయింది. ఇకనైనా జనంలో చైతన్యం వస్తుందేమో. చెప్పిన పని ఏదీ చేశావు నువ్వు అని ఈసారి వచ్చినప్పుడు ఆయనను నిలేసి అడుగుతారేమో చూద్దాం.



శ్రద్ధాంజలి

మంచికి మారుపేరుగా నిలచి, మాకు ఆప్యాయతాను రాగాలు పంచిపెట్టి, మా అభివృద్ధికి కారకులైన మా యింటి దైవం, మా తండ్రి

శ్రీ కేతిరెడ్డి పిచ్చిరెడ్డి గారు

11.9.2002తేది బుధవారం మాకు దూరమై భగవంతునికి చేరువైనారు. వారి ఆత్మకు చిరశాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ, శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారుడు
కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి
తమిళనాడు తెలుగుయువశక్తి అధ్యక్షుడు,
చెన్నపురి తెలుగువాణి సంపాదకుడు,
చలనచిత్ర దర్శక నిర్మాత, ఫిలింసెన్సార్‌బోర్డు మాజీ సభ్యుడు
ఫోన్స్: 040 - 6543337, సెల్: 98850 - 78333

భార్య **కేతిరెడ్డి ఆదిశేషమ్మ**

కుమార్తె - అల్లుడు
సిద్దారెడ్డి శైలజ **సిద్దారెడ్డి సుధాకర్‌రెడ్డి** M.Sc., Ag.
ఫోన్స్: 040 - 6660599, సెల్: 98490 - 12822

మనుమడు - మనుమరాలు
సిద్దారెడ్డి హరీష్‌రెడ్డి B.Tech **సిద్దారెడ్డి హరిత** B.Tech

శ్రీ కేతిరెడ్డి పిచ్చిరెడ్డి గారు

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press. Ph: 091-861-327354, Offset Printing at Zaminryot Press, Nellore.